జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | బుధవారం 4 నవంబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :290 | పేజీలు : 12 | వెల : 3/-

PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 ، సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 ، చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com




# కంగ్రాట్స్ చంద్రబాబు టీమ్!



- మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై స్పందించిన వైసీపీ అధినేత జగన్
- చంద్రబాబు, పోలీసులు, ఎస్ఈసీకి కంగ్రాట్స్ అంటూ వ్యంగ్యం
- ఇవి ఎన్నికలు కాదని, ఏకపక్షంగా జరిగిన సెలక్షన్లని ఆరోపణ
- నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు ప్రక్రియను హైజాక్ చేశారని విమర్శ
- ఎన్నికల సంస్కరణల ఆవశ్యకత స్పష్టమైందని వ్యాఖ్య

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కూటమి ప్రభంజనం సృష్టిస్తున్న వేళ, వైసీపీ అధినేత జగన్ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. ఎన్నికల ప్రక్రియ ఏకపక్షంగా జరిగిందని ఆరోపిస్తూ, ఇవి ఎలక్షన్లు కావని, సెలెక్షన్లు అని ఆయన వ్యంగ్యం ప్రదర్శించారు. చంద్రబాబు, పోలీసులు, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఉద్దేశించి జగన్ వ్యంగ్యంగా అభినందనలు తెలిపారు. "ప్రతిపక్షానికి పోటీ చేసే అవకాశమే ఇవ్వకుండా ఎన్నికల్లో - మిగతా3లో

# చిన్న పట్టణాలే రేపటి ఆర్థిక శక్తులు

- చిన్న పట్టణాలే అభివృద్ధి చోదకశక్తులు..
- వందలాది సిటీలను గ్రోత్ హబ్‌లుగా మార్చాలి: మోదీ
- పట్టణాభివృద్ధికి రూ.లక్ష కోట్ల అర్బన్ ఛాలెంజ్ ఫండ్
- రూ.21,800 కోట్ల పుణె మెట్రో ప్రాజెక్టు ప్రారంభం
- 26 నగరాలకు విస్తరించిన మెట్రో సేవలు..

రూ.లక్ష కోట్లతో మోదీ మాస్టర్‌ప్లాన్!





## ట్రంప్‌కు అగ్నిపరీక్ష..

- అమెరికాలో మొదలైన మధ్యంతర ఎన్నికల పోలింగ్
- అమెరికాలో కీలకమైన మధ్యంతర ఎన్నికల పోలింగ్ ప్రారంభం
- ప్రతినిధుల సభలోని 435, సెనెట్‌లోని 35 స్థానాలకు ఓటింగ్

# కూటమి ప్రభంజనం





- 13 కార్పొరేషన్లలోనూ ఎన్డీఏ కూటమి ఆధిక్యం
- మున్సిపాలిటీల్లోనూ టీడీపీ కూటమి హవా
- 92 పట్టణ స్థానిక సంస్థల్లో కొనసాగుతున్న ఓట్ల లెక్కింపు
- పులివెందులపై ప్రత్యేక ఉత్కంఠ.. కౌంటింగ్‌కు హైకోర్టు గ్రీన్ సిగ్నల్
- 2021 ఫలితాలకు భిన్నంగా మారిన రాజకీయ పరిస్థితులు

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభంజనం సృష్టిస్తోంది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఓట్ల లెక్కింపులో కూటమి అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో ఆధిక్యం ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా 13 నగర పాలక సంస్థల్లోనూ ఎన్డీఏ కూటమి అభ్యర్థులు ఆధిక్యంలో ఉండటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. - మిగతా3లో

# ఆయుధాల తయారీలో భారత్ దూకుడు

- రక్షణ రంగంలో స్వయం సమృద్ధి లక్ష్యం..
- 2029 నాటికి రూ.3 లక్షల కోట్ల ఉత్పత్తులు!
- రూ.50 వేల కోట్లకు రక్షణ ఎగుమతులు పెంచడమే ధ్యేయం
- పదేళ్లలో భారీగా పెరిగిన దేశీయ రక్షణ ఉత్పత్తులు
- రూ.7.85 లక్షల కోట్లకు చేరిన రక్షణ బడ్జెట్
- సైనిక ఆధునికీకరణకు కేంద్రం ప్రత్యేక ప్రాధాన్యం





## రామ మందిరం విరాళాల కేసుపై స్వతంత్ర విచారణ జరపాలి

- సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాలని డిమాండ్
- 105 చోరీ ఘటనలు.. రూ.79.85 లక్షల రికవరీపై జైరాం రమేశ్ ప్రశ్నలు
- 2020 ఆడిట్ నివేదికలోని లోపాలపైనా విచారణ జరపాలని సూచన



## నిరసనలకు హద్దులు ఉండాలి

- ఒకే వేదికపై నిరవధిక ఆందోళనలు ఎలా?: సుప్రీంకోర్టు
- నిరసన హక్కుతో పాటు ఇతరుల ప్రయోజనాలూ ముఖ్యం
- రామ్‌లీలా మైదానం ఆందోళనలపై వ్యాపార సంఘాల పిటిషన్
- నిరసన నిర్వాహకులను కూడా ప్రతివాదులుగా చేర్చాలని సూచన

# ఆర్టీజీఎస్ అస్త్రంతో తుపానులకు చెక్

- టెక్నాలజీతో తుపానులపై విజయం.. ప్రాణనష్టం లేకుండా చూశాం!
- ఆర్టీజీఎస్, అవేర్ వ్యవస్థలతో ముందస్తు అంచనాలు.. సమర్థవంతంగా సహాయక చర్యలు
- అర్నబ్, మురసు తుపాన్లను పక్కా ప్రణాళికతో ఎదుర్కొన్నాం
- 90 శాతం కచ్చితత్వంతో వాతావరణ అంచనాలు
- 31 వేల విద్యుత్ స్తంభాలు నేలకూలినా 4-5 రోజుల్లోనే పునరుద్ధరణ
- విద్యుత్ సిబ్బంది సేవలకు సీఎం చంద్రబాబు ప్రశంసలు



**అమరావతి**

ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడంలో సాంకేతికతను సమర్థంగా వినియోగించుకుంటే భారీ నష్టాలను కూడా నియంత్రించవచ్చని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంపై వరుసగా విరుచుకుపడిన అర్నబ్, మురసు తుపానులను పక్కా ప్రణాళిక, ముందస్తు అంచనాలు, అధికార యంత్రాంగం సమన్వయంతో సమర్థవంతంగా ఎదుర్కొన్నామని తెలిపారు. ఆర్టీజీఎస్ (రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ), అవేర్ సాంకేతిక వేదికల ద్వారా వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు విశ్లేషించి నిర్ణయాలు తీసుకోవడం వల్లే - మిగతా3లో



# మురసు తుపాను బలహీనం

- తీరం దాటిన తీవ్ర తుపాను.. పలు జిల్లాలకు వర్ష సూచన
- ఒంగోలు సమీపంలో తీరం దాటిన మురసు
- 80--90 కి.మీ. వేగంతో గాలులు.. 100 కి.మీ. వరకు ఈదురుగాలులు
- బాపట్లకు 40 కి.మీ. దూరంలో కేంద్రీకృతం
- కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. విపత్తుల నిర్వహణ సంస్థ సూచన

**అమరావతి:**

ఆంధ్రప్రదేశ్‌ను వణికించిన మురసు తీవ్ర తుపాను తీరం దాటినప్పటికీ రాష్ట్రానికి వర్షాల ముప్పు పూర్తిగా తొలగిపోలేదు. తుపాను క్రమంగా బలహీనపడుతున్నా పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ - మిగతా3లో



# బయటి శక్తుల ప్రభావానికి లొంగని భారత్-రష్యా స్నేహం

- భారత్-రష్యా బంధం చెక్కుచెదరదు.. బయటి శక్తులతో విడదీయలేరు!
- కాలపరీక్షకు తట్టుకున్న ఇరు దేశాల స్నేహం.. గాంధీ-టాల్‌స్టాయ్ లేఖలతో చారిత్రక అనుబంధం
- 80 ఏళ్ల దౌత్య సంబంధాల వేడుకలకు రష్యా సన్నాహాలు
- ఉక్రెయిన్‌పై రష్యా దాడులు.. అమెరికా సాయం కోరిన జెలెన్‌స్కీ

# అసర్ల గంగమ్మ అమ్మవారి ఆశీస్సులతో సుగవాసి







మండిపల్లి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం! ఆలయంలో ప్రత్యేక పూజలు... గ్రామ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం... ఎన్నికల ప్రచారంలో ఉత్సాహభరిత వాతావరణం! పేరంపల్లె । అసర్ల గంగమ్మ ఆలయం గాలివీడు మండలంలో తెలుగుదేశం పార్టీ, కూటమి ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఉదయం పేరంపల్లె గ్రామంలోని అసర్ల గంగమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందిన రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాలివీడు స్థానిక అభ్యర్థి శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు గారు, మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి గారు అనంతరం పేరంపల్లె, గోపనపల్లె గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

**అసర్ల గంగమ్మ అమ్మవారి సన్నిధిలో పూజలు... ప్రజల మధ్య ఎన్నికల ప్రచార సందడి!**

అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజల అభివృద్ధి, శ్రేయస్సు ఆకాంక్షిస్తూ ఆశీస్సులు పొందారు. అనంతరం గ్రామ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై రాబోయే గాలివీడు స్థానిక ఎన్నికల ప్రచారంపై విస్తృతంగా చర్చించారు.

**గ్రామ నాయకులతో ఆత్మీయ సమావేశం... ప్రచారానికి దిశానిర్దేశం!**

పేరంపల్లె, గోపనపల్లె గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన సుగవాసి ప్రసాద్ బాబు గారు, మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి గారు గ్రామస్థాయిలో ఎన్నికల ప్రచార నిర్వహణ, నాయకులు--కార్యకర్తల సమన్వయం, ప్రజలతో మమేకం కావడం, స్థానిక సమస్యలు, ప్రజల అభిప్రాయాలపై చర్చించారు.గ్రామాల్లో ప్రతి ఒక్కరినీ కలుస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

**అడుగడుగునా ఆత్మీయత... నాయకులకు ఘన స్వాగతం!**

ఈ సందర్భంగా పేరంపల్లె, గోపనపల్లె గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సుగవాసి ప్రసాద్ బాబు గారికి, మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి గారికి ఆత్మీయ స్వాగతం పలికారు. సమావేశంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని ఎన్నికల ప్రచారానికి తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

**నవంబర్ 5న గాలివీడు ఎన్నికలు... సైకిల్ గుర్తుపై ప్రచారానికి పిలుపు!**

రాబోయే నవంబర్ 5వ తేదీ గాలివీడు స్థానిక ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సుగవాసి ప్రసాద్ బాబు గారి సైకిల్ గుర్తుకు సంబంధించిన ఎన్నికల ప్రచార అంశాలను ప్రజలకు వివరించారు.గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రచారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.అసర్ల గంగమ్మ అమ్మవారి ఆశీస్సులు... ప్రజల ఆదరణ... కార్యకర్తల ఉత్సాహం... సుగవాసి -- మండిపల్లి ఎన్నికల ప్రచారానికి మరింత బలం! ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నివాళులు అర్పించిన అడివప్ప గౌడ్....

**:-అంత్యక్రియలకు 5,000 రూపాయలు ఆర్థిక సాయం చేసిన అడివప్ప గౌడ్...**



**కౌతాళం,నవంబర్ 03 ప్రజా జ్యోతి** మండలంలోని వల్లూరు గ్రామంలో వడ్డే శేకన్న మృతి చెందాడని విషయం తెలిసిన వెంటనే తెదేపా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్ మృతి చెందిన కుటుంబానికి వెళ్లి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలకు 5,000 రూపాయలు ఆర్థిక సాయం చేశారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సంతపం తెలిపారు. అడివప్ప గౌడ్ వెంట తెలుగు తమ్ముళ్లు ఉన్నారు.

## 14వ వార్డులో టీడీపీ అభ్యర్థి లక్ష్మిదేవి భారీ విజయం

**970 ఓట్ల భారీ మెజార్టీతో ఘన గెలుపు.. అనుచరుల్లో ఆనందోత్సాహాలు**



**ఎమ్మిగనూరు, నవంబర్ 3 (ప్రజా జ్యోతి):** ఎమ్మిగనూరు పట్టణ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో 14వ వార్డు నుంచి తెలుగుదేశం పార్టీ (టీడీపీ) కౌన్సిలర్ అభ్యర్థి లక్ష్మిదేవి భారీ విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థిపై 970 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఓట్ల లెక్కింపులో ఆరంభం నుంచి ఆధిక్యం కొనసాగించిన లక్ష్మిదేవి విజయం సాధించడంతో టీడీపీ శ్రేణులు, ఆమె అనుచరులు, మద్దతుదారుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఫలితాలు వెలువడిన అనంతరం పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. 14వ వార్డు ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా వార్డు అభివృద్ధికి కృషి చేయాలని స్థానికులు ఆకాంక్షించారు.

## విజయవంతంగా ముగిసిన ఎన్నికల ప్రచారం



తెలుగుదేశం పార్టీ దేవనకొండ జెడ్పిటిసి అభ్యర్థి డాక్టర్ షేక్ సాధిక గత పది రోజులుగా నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమాలు విజయవంతంగా ముగిసాయి. అక్టోబర్ 22వ తేదీన తన నామినేషన్ దాఖలు చేసిన షేక్ సాధిక నా ప్రచార కార్యక్రమాన్ని అక్టోబర్ 25వ తేదీన మండలంలోని మాచాపురం గ్రామం నుంచి ప్రారంభించారు. పది రోజులపాటు మండలంలోని 44 గ్రామాల్లోని ప్రతి పల్లెకు వెళ్లి ప్రతి వీధి, ప్రతి గడప తొక్కారు. తనను కలిసిన ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను జడ్పిటిసిగా గెలిపించాలని చేతులు జోడి విన్నవించుకున్నారు. మండలం అభివృద్ధి చేసేందుకు తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. సోమవారం మండల కేంద్రమైన దేవనకొండలో నిర్వహించిన రోడ్ షో కార్యక్రమానికి టిడిపి ఆలూరు ఇన్చార్జి వైకుంఠం జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈరోజు కార్యక్రమం విజయవంతమైంది. సాయంత్రం పి. కోటకొండ గ్రామంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం శివప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై గ్రామ ప్రజలు, ఓటర్లను ఆకర్షిస్తూ చేసిన మాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. చివరి రోజు మంగళవారం టిడిపి జెడ్పిటిసి అభ్యర్థి సాధిక, పార్టీ నాయకులు పి కోటకొండ గ్రామంలో ఇంటింటికి తిరిగి ఓటు అభ్యర్థిస్తూ ప్రచారం నిర్వహించి ముగించారు.

జై తెలుగుదేశం.. జై చంద్రబాబు గారు.. జై నారా లోకేష్ గారు, జై వైకుంఠం జ్యోతి అక్క గారు.. జై దేవనకొండ.

## మురుసు తుఫాను పట్ల జాగ్రత్తగా ఉండండి తాసిల్దార్ విజయ్ కుమారి



**చెన్నూరు ప్రజా జ్యోతి, అక్టోబర్ 3** రాష్ట్రంలో ముంచు కొస్తున్న మురుసు తుఫాను పట్ల ప్రజ లు జాగ్రత్తగా ఉండాలని చెన్నూరు మండల తాసిల్దార్ విజయ కుమారి అన్నారు. మంగళ వారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ వాగులు ,వంకలు వరద నీరు అవకాశం ఉందని జాగ్రత్తగా ఉండాలని కోరారు. పాత మిద్దెలు, దెబ్బతిన్న పాఠశాలల్లో బిచ్చగాళ్ళు ఆశ్రయం పొందుతుంటారని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. మత్స్యకారులు వేటకు వెళ్ళవద్దని ఆమె సూచించారు. రాబోవు3 రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని కావున ప్రజలు ఉండాలని అన్నారు. ప్రజలకు తెలిసేందుకు గ్రామాల్లో దండోరా వేయించాలని వీఆర్వోలకు సూచించారు. ఆస్తి నష్టం జరక్కుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఒక జాగ్రత్త తీసుకోవాలని ఈ సందర్భంగా మా కోరారు. రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూముకు సమాచారం అందించాలని తాసిల్దార్ కోరారు.

## 15వ వార్డులో టీడీపీ అభ్యర్థి మహబూబ్ విజయం.



**ఎమ్మిగనూరు, నవంబర్ 3 (ప్రజా జ్యోతి):** ఎమ్మిగనూరు మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో 15వ వార్డు నుంచి టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థి మహబూబ్ 260 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఫలితాలు వెలువడడంతో ఆయన అనుచరులు, మద్దతుదారులు సంబరాలు చేసుకున్నారు. విజయం సాధించిన మహబూబ్‌కు పలువురు అభినందనలు తెలిపారు

## ప్రజల మధ్యే ఉంటా.. ప్రజా సమస్యల పరిష్కారమే నా లక్ష్యం!

**కూనవరం అభివృద్ధికి ఒక్క అవకాశం ఇవ్వండి.. మీ సేవకుడిగా నిరంతరం పనిచేస్తా!**

**కోతుల బెడద, తాగునీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థకు శాశ్వత పరిష్కారం చూపుతా..**

**పోలవరం నిర్వాసితుల హక్కుల కోసం చివరి వరకు పోరాడతా!**

**ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించండి**

**కూనవరం--1 ఎంపీటీసీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సోడే మహేంద్రకుమార్ విజ్ఞప్తి**

**కూనవరం నవంబర్ 3, ( ప్రజా జ్యోతి ప్రతినిధి కిరణ్ బాబు)**

**కూనవరం:** పదవుల కోసం కాదు.. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చానని, కూనవరం గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని కూనవరం--1 ఎంపీటీసీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సోడే మహేంద్రకుమార్ పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి అండగా ఉంటూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యత!**

కూనవరం గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని మహేంద్రకుమార్ తెలిపారు. ముఖ్యంగా కోతుల బెడదతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా చర్యలు తీసుకోవడం, గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం తన ప్రాధాన్యతలని వివరించారు.

**పోలవరం నిర్వాసితుల పక్షాన పోరాటం!**

పోలవరం ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులైన కుటుంబాలకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి నిర్వాసిత కుటుంబానికి న్యాయమైన ప్యాకేజీ అందే వరకు వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తానని భరోసా ఇచ్చారు. నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

**ఎన్నికలప్పుడే కాదు.. నిత్యం ప్రజల మధ్యే ఉంటా!**

ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ప్రజల వద్దకు వచ్చి, ఎన్నికల అనంతరం కనిపించకుండా పోయే నాయకుడిని కాదని మహేంద్రకుమార్ స్పష్టం చేశారు. గ్రామ ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటూ, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటానని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని



చెప్పారు.

**గ్రామ అభివృద్ధికి మీ ఆశీర్వాదం కావాలి!**

కూనవరం గ్రామ సోదర సోదరీమణులకు, అన్నదమ్ములకు, అక్కాచెల్లెళ్లకు, యువతకు, పెద్దలకు శిరస్సు వంచి నమస్కరిస్తూ తనకు మద్దతుగా నిలవాలని కోరారు. మీ ఆదరాభిమానాలు, ఆశీర్వాదాలతో ఎంపీటీసీగా గెలిస్తే గ్రామ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు.

**ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి కోసం పనిచేసి చూపిస్తా!**

ప్రజాసేవ చేయాలనే తన సంకల్పానికి ప్రజల మద్దతు అందించాలని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన తనకు ఫ్యాన్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కూనవరం గ్రామ ప్రజలను సోడే మహేంద్రకుమార్ వినమ్రంగా అభ్యర్థించారు.

## ప్రచారంలో భాగంగా అనంతగిరి మండల ప్రజానీకానికి కాంగ్రెస్ పార్టీ జడ్పి.టి.సి అభ్యర్థిని నరాజీ మనిషా విజ్ఞప్తి.

**అనంతగిరి మండలం. నవంబర్ 3. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.**అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం.అనంతగిరి మండల సమగ్ర అభివృద్ధి కోసం మనందరి అభ్యర్థి.అనంతగిరి మండలంలోని ప్రతి ఒక్క తల్లిదండ్రులకు, మేధావులకు, పెద్దలకు, యువతీ యువకులకు మరియు సోదరసోదరీమణులందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు.మన మండల ప్రజల సమస్యల పరిష్కారం కోసం, నిరుద్యోగ యువతకు మెరుగైన భవిష్యత్తును అందించడం కోసం నిరంతరం శ్రమించే మీ ఇంటి బిడ్డ, యువ నాయకురాలు నారాజి మనీషా. అనంతగిరి మండల జడ్పీ.టీ.సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాంగ్రెస్‌ను గెలిపించండి అనంతగిరి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించండి అనే ఆశయంతో ముందుకు సాగుతున్న మన మనీషా గారిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉంది.

**మన ప్రధాన ఉద్దేశాలు. హామీలు:**

నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయడం. అనంతగిరి మండలంలో యువతకు కొత్త ఉపాధి అవకాశాలు కల్పించడం మరియు మౌలిక వసతుల కల్పన.గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారులు, తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాల అభివృద్ధి. ప్రజల గొంతుకై శాసించి, ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడం.

**ముగింపు ప్రచార పిలుపు (తేదీ: 03-11-2026):**

ఈరోజుతో మన ఎన్నికల ప్రచారం ముగియనుంది. ఈ చివరి రోజున నాపై నమ్మకంతో ముందంజ వేస్తున్న పెద్దలు, నాయకులు, కార్యకర్తలు మరియు శ్రేయోభిలాషులందరూ మీమీ గ్రామాల్లో ప్రచారాన్ని మరింత ఉధృతంగా ముందుకు తీసుకెళ్లాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను. ప్రతీ ఇంటి తలుపు తట్టి మన హస్తం గుర్తు సందేశాన్ని చేరవేయండి. మీ ప్రోత్సాహమే నా బల నిరూపణగుర్తుంచుకోండి.

**హస్తం గుర్తు క్రమ సంఖ్య: 3.**

రాబోయే ఎన్నికలలో మీ అమూల్యమైన ఓటును 'హస్తం' గుర్తుపై వేసి, అత్యధిక మెజారిటీతో శ్రీమతి నారాజీ మనీషా గారిని గెలిపించాలని అనంతగిరి మండల ప్రజలందరినీ సవినయంగా అభ్యర్థిస్తున్నాము.అనంతగిరి మండల కాంగ్రెస్ పార్టీ కుటుంబం శ్రేయోభిలాషుల నా యొక్క విజ్ఞప్తి.



# కూటమి ప్రభంజనం..

-మొదటిపేజీ తరువాయి

మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోనూ కూటమి అభ్యర్థులు గట్టి పోటీ ఇస్తున్నారు. మరోవైపు ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆశించిన స్థాయిలో ఆధిక్యం లభించకపోవడం చర్చనీయాంశంగా మారింది. 2021 మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆధిపత్యం ప్రదర్శించిన వైసీపీకి ప్రస్తుత ఎన్నికల ఫలితాల సరళి భిన్నమైన రాజకీయ పరిస్థితులను సూచిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 79 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలతో కలిపి మొత్తం 92 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల ప్రక్రియ చేపట్టారు. నవంబర్ 1న ప్రధాన పోలింగ్ నిర్వహించగా, అవసరమైన చోట్ల నవంబర్ 2న రీపోలింగ్ చేపట్టారు. మంగళవారం ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభ మైంది. మొత్తం 3,186 వార్డులకు సంబంధించిన ఓట్లను అధికారులు లెక్కిస్తున్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కౌంటింగ్ కేంద్రాలు, టేబుళ్లు ఏర్పాటు చేసి భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. కొన్ని ప్రాంతాల్లో వర్షాల కారణంగా కౌంటింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఫలితాల ప్రకటనతో పట్టణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉంది.




### కార్పొరేషన్లలో కూటమి అధిక్యం

రాష్ట్రంలోని ప్రధాన నగరపాలక సంస్థల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు ఆధిక్యం ప్రదర్శిస్తున్నారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, నెల్లూరు, కడప, మచిలీపట్నం సహా కీలక కార్పొరేషన్లలో కూటమి అభ్యర్థులు ముందంజలో కొనసాగుతున్నారు. మొత్తం 13 కార్పొరేషన్లలోనూ కూటమి ఆధిక్యంలో ఉన్నట్లు సాయంత్రం వెలువడిన ట్రెండ్స్ వెల్లడిస్తున్నాయి. అయితే వార్డుల వారీగా ఓట్ల లెక్కింపు పూర్తయి, అధికారిక ఫలితాలు ప్రకటించిన తర్వాతే మేయర్ స్థానాలపై స్పష్టత రానుంది.

### మున్సిపాలిటీల్లోనూ కూటమి జోరు

మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోనూ కూటమి అభ్యర్థులు ఆధిక్యం ప్రదర్శిస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య ముందుగానే కుదిరిన సీట్ల సర్దుబాటు ఈ ఎన్నికల్లో కీలకంగా మారింది. మొత్తం 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో 17 చోట్ల చైర్‌పర్సన్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన స్థానాల్లో పోలింగ్ నిర్వహించారు. ఏకగ్రీవ స్థానాల్లోనూ కూటమి పార్టీల అభ్యర్థులే ఎక్కువగా ఉండటం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. తాజా లెక్కింపు ట్రెండ్స్‌లోనూ కూటమి అభ్యర్థులు మెజారిటీ పట్టణాల్లో ఆధిక్యంలో కొనసాగుతున్నారు.

### పులివెందులపై ప్రత్యేక ఆసక్తి

ఈ ఎన్నికల్లో అందరి దృష్టిని ఆకర్షించిన నియోజకవర్గాల్లో పులివెందుల ఒకటి. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో ఇక్కడి మున్సిపల్ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పోలింగ్ సందర్భంగా చోటుచేసుకున్న వివాదాలు, రీపోలింగ్ అంశాలపై వైసీపీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. కౌంటింగ్‌ను నిలిపివేయాలని కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అయితే మంగళవారం ఉదయం హైకోర్టు ఆ పిటిషన్లను తిరస్కరించి ఓట్ల లెక్కింపునకు అనుమతి ఇచ్చింది. దీంతో పులివెందులలోనూ కౌంటింగ్ ప్రక్రియ కొనసాగింది. ఈ ఫలితాలు వైసీపీకి ప్రతిష్ఠాత్మకంగా మారాయి.

### కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు

ఎన్నికల్లో భాగంగా 13 కార్పొరేషన్ల మేయర్ స్థానాల్లో టీడీపీ 10 చోట్ల, జనసేన రెండు చోట్ల, బీజేపీ ఒక చోట పోటీ చేశాయి. అలాగే 70 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల చైర్‌పర్సన్ స్థానాలకు జరిగిన పోటీలో టీడీపీ 49, జనసేన 17, బీజేపీ నాలుగు స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దించాయి. మరోవైపు వైసీపీ అన్ని 13 కార్పొరేషన్లతో పాటు ఎన్నికలు జరిగిన 70 చైర్‌పర్సన్ స్థానాల్లోనూ పోటీ చేసింది. కూటమి ఐక్యత, పరస్పర సహకారం ఎన్నికల్లో తమకు కలిసివచ్చాయని అధికారపక్ష నేతలు భావిస్తున్నారు.

### వైసీపీకి రాజకీయ సవాల్

2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాజయం తర్వాత వైసీపీకి ఈ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు మరో కీలక పరీక్షగా మారాయి. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని వైసీపీ ప్రచారం చేయగా, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమ విజయానికి బాటలు వేస్తాయని కూటమి నేతలు విశ్వసించారు. తాజా కౌంటింగ్ ట్రెండ్స్‌లో కూటమి ఆధిక్యం కొనసాగుతుండటంతో వైసీపీ రాజకీయ వ్యూహాలపై చర్చ మొదలైంది. అయితే తుది ఫలితాలు, వార్డుల వారీగా గెలుపోటములు వెల్లడైన తర్వాతే పట్టణ ఓటరు తీర్పుపై పూర్తి స్పష్టత రానుంది.

### తుది ఫలితాల కోసం ఉత్కంఠ

రాష్ట్రవ్యాప్తంగా కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుండటంతో రాజకీయ పార్టీల్లో ఉత్కంఠ నెలకొంది. మేయర్, చైర్‌పర్సన్ స్థానాలతో పాటు కార్పొరేటర్లు, కౌన్సిలర్లుగా ఎవరు ఎన్నికవుతారన్నది ఆసక్తికరంగా మారింది. మెజారిటీ స్థానాల్లో ఆధిక్యం కొనసాగిస్తున్న కూటమి తుది ఫలితాల్లోనూ ఇదే జోరు ప్రదర్శిస్తుందా? వైసీపీ ఏయే ప్రాంతాల్లో పుంజుకుంటుంది? అన్నది తేలాల్సి ఉంది. మొత్తంగా ఈ ఎన్నికల ఫలితాలు ఆంధ్రప్రదేశ్ పట్టణ రాజకీయాల్లో కీలక మార్పులకు నాంది పలికే అవకాశముంది.

## మురసు తుపాను బలహీనం..

-మొదటిపేజీ తరువాయి

శాఖ (ఐఎండీ), రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరిస్తున్నాయి. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకల పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున నెల్లూరు--నర్సాపురం మధ్య ఒంగోలు సమీపంలో మురసు తుపాను తీరం దాటింది. అనంతరం భూభాగంపైకి ప్రవేశించిన తుపాను క్రమంగా బలహీనపడుతోంది. అయినప్పటికీ దాని ప్రభావంతో కోస్తాంధ్రలో వర్షాలు, ఈదురుగాలులు కొనసాగుతున్నాయి.

### ఒంగోలు సమీపంలో తీరం దాటిన తుపాను

ఐఎండీ తాజా నివేదిక ప్రకారం నవంబర్ 3న తెల్లవారుజామున 3.30 గంటల నుంచి 5.30 గంటల మధ్య మురసు తుపాను దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటింది. నెల్లూరు నుంచి నర్సాపురం మధ్య ఒంగోలు సమీపంలో తీరం దాటిన సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు నమోదయ్యాయి. తుపాను తీరం దాటే సమయంలో సముద్రం అల్లకల్లోలంగా మారడంతో తీర ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు.

### తుపాను తీవ్రత తగ్గుముఖం

తీరం దాటిన తర్వాత మురసు తుపాను ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా బలహీనపడింది. మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయానికి బాపట్లకు పశ్చిమ వాయవ్య దిశలో 40 కిలోమీటర్లు, ఒంగోలుకు ఉత్తరంగా 60 కిలోమీటర్లు, విజయవాడకు నైరుతి దిశలో 80 కిలోమీటర్లు, మచిలీపట్నానికి పశ్చిమంగా 110 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ సమయంలో గాలుల వేగం గంటకు 80--90 కిలోమీటర్లకు తగ్గగా, అప్పుడప్పుడు 100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచాయి. అర్ధరాత్రి నాటికి తీవ్ర వాయుగుండంగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

### పలు జిల్లాల్లో భారీ వర్షాల హెచ్చరిక

తుపాను బలహీనపడుతున్నప్పటికీ దాని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగనున్నాయి. మంగళవారం కోస్తాంధ్రలో అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. పల్నాడు, తిరుపతి, నంద్యాల జిల్లాల్లో ఒకటి రెండు ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

### నవంబర్ 4న కూడా వర్షాలు

మురసు తుపాను బలహీనపడినప్పటికీ నవంబర్ 4న కూడా వర్షాల ప్రభావం కొనసాగే అవకాశం ఉంది. పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. కోస్తాంధ్ర, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. తుపాను ప్రభావంతో ఇప్పటికే భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో అదనపు వర్షపాతం నమోదైతే వరద పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు.

### ఆకస్మిక వరదలపై అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు, కాలువలు పొంగిపొర్లే ప్రమాదం ఉందని విపత్తుల నిర్వహణ అధికారులు హెచ్చరిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. వరద నీరు ప్రవహించే రహదారులు, వంతెనలు, కల్వర్టులను దాటేందుకు ప్రయత్నించవద్దని స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణాలు తగ్గించుకోవాలని, అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచిస్తున్నారు. విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలు, నేలకూలిన చెట్లకు దూరంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

### తుపాను బలహీనపడినా హెచ్చరికలు కొనసాగింపు

మురసు తుపాను తీవ్రత తగ్గడం ఊరటనిచ్చే అంశమే అయినప్పటికీ వర్షాలు, వరదల ముప్పు పూర్తిగా తొలగిపోలేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. జిల్లా యంత్రాంగాలు పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాయి. సహాయక బృందాలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అధికారుల నుంచి తదుపరి హెచ్చరికలు వచ్చే వరకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని విపత్తుల నిర్వహణ సంస్థ విజ్ఞప్తి చేస్తోంది.

# ఆర్టీజీఎస్ అస్త్రంతో తుపానులకు చెక్

-మొదటిపేజీ తరువాయి

ప్రాణనష్టాన్ని నివారించగలిగామని పేర్కొన్నారు. మంగళవారం అమరావతిలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి నిర్వహించిన మీడియా సమావేశంలో తుపానుల సమయంలో ప్రభుత్వం చేపట్టిన ముందస్తు చర్యలు, సహాయక కార్యక్రమాలు, విద్యుత్ పునరుద్ధరణ పనుల వివరాలను వెల్లడించారు.

### రెస్క్యూ, రిలీఫ్, పునరావాసంపై ప్రత్యేక దృష్టి


తుపానుల సమయంలో ప్రభుత్వం ప్రధానంగా మూడు అంశాలపై దృష్టి సారించిందని చంద్రబాబు తెలిపారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అవసరమైన సహాయక సామగ్రిని అందించడం, ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులను పునరుద్ధరించడం లక్ష్యంగా పనిచేశామని వివరించారు. తుపానుల గమనాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గాలుల వేగం, వర్షపాతం, వరద ముప్పును ముందుగానే అంచనా వేసినట్లు చెప్పారు. ఈ సమాచారాన్ని ఆర్టీజీఎస్ ద్వారా క్షేత్రస్థాయి అధికారులకు చేరవేసి అప్రమత్తం చేశామని వెల్లడించారు.

### 90 శాతం కచ్చితత్వంతో వాతావరణ అంచనాలు

విపత్తుల నిర్వహణలో డేటా ఆధారిత నిర్ణయాలు కీలక పాత్ర పోషించాయని ముఖ్యమంత్రి వివరించారు. అవేర్ వేదిక ద్వారా అందిన సమాచారాన్ని విశ్లేషించి, వర్షపాతం, గాలుల వేగం, వరద పరిస్థితులపై ముందస్తు అంచనాలు రూపొందించామని తెలిపారు. దాదాపు 90 శాతం కచ్చితత్వంతో వాతావరణ పరిస్థితులను అంచనా వేయగలిగామని పేర్కొన్నారు. ఈ అంచనాలను క్షేత్రస్థాయిలో నెలకొన్న వాస్తవ పరిస్థితులతో పోల్చి పరిశీలించినప్పుడు అవి సరైనవిగా తేలాయని చెప్పారు. టెక్నాలజీని పాలనలో భాగస్వామ్యం చేయడం వల్ల విపత్తుల సమయంలో వేగంగా స్పందించగలిగామని వివరించారు.

### ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తింపు

ముందస్తు హెచ్చరికల ఆధారంగా ముంపునకు గురయ్యే గ్రామాలు, ప్రాంతాలను ముందుగానే గుర్తించగలిగామని చంద్రబాబు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో సహాయక



బృందాలు, అవసరమైన పరికరాలు, ఇతర సామగ్రిని ముందుగానే సిద్ధం చేశామని చెప్పారు. ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరినీ సమన్వయం చేస్తూ సహాయక చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చోట అదనపు సిబ్బందిని మోహరించామని తెలిపారు. దీంతో తుపానుల ప్రభావం తగ్గిన వెంటనే సహాయక చర్యలను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులను తీసుకురాగలిగామని వెల్లడించారు.

### 31 వేల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి

తుపానుల ప్రభావంతో రాష్ట్ర విద్యుత్ వ్యవస్థకు భారీ నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 31 వేల విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, 4,095 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని తెలిపారు. మొత్తం 548 సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని వెల్లడించారు. ఇంతటి భారీ నష్టం జరిగినప్పుడు సాధారణ పరిస్థితుల్లో విద్యుత్ వ్యవస్థను పూర్తిగా పునరుద్ధరించడానికి కనీసం 20 రోజుల సమయం పట్టేదని, అయితే అధికారుల సమన్వయం, పక్కా ప్రణాళికతో కేవలం నాలుగు నుంచి ఐదు రోజుల్లోనే సరఫరాను గాడిలో పెట్టగలిగామని చెప్పారు.

### ప్రాణాలకు తెగించి పనిచేసిన విద్యుత్ సిబ్బంది

విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో సిబ్బంది చూపిన అంకితభావాన్ని చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల నుంచి లైన్‌మెన్లు, క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ నిరంతరం పనుల్లో నిమగ్నమయ్యారని తెలిపారు. భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ పనులు ఆపకుండా కొనసాగించారని పేర్కొన్నారు. నేలకూలిన చెట్లను తొలగిస్తూ, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తిరిగి ఏర్పాటు చేశారని వివరించారు. ముఖ్యంగా ఆక్వా చెరువుల్లో పడిపోయిన విద్యుత్ స్తంభాలను తిరిగి నిలబెట్టడం పెద్ద సవాలుగా మారిందని చెప్పారు. ఈ పనుల కోసం పెద్ద సంఖ్యలో డ్రిల్లింగ్ యంత్రాలను వినియోగించామని వెల్లడించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో సిబ్బంది ప్రాణాలకు తెగించి పనిచేశారని, వారి సేవలు అభినందనీయమని ముఖ్యమంత్రి కొనియాడారు.

### విపత్తుల నిర్వహణలో సాంకేతికతే కీలకం

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వ యంత్రాంగం ఎంత వేగంగా స్పందిస్తుందన్నదే నష్టాన్ని తగ్గించడంలో కీలకమని చంద్రబాబు పేర్కొన్నారు. ముందస్తు అంచనాలు, సాంకేతిక పరిజ్ఞానం, సమర్థవంతమైన ప్రణాళిక, శాఖల మధ్య సమన్వయం ఉంటే విపత్తుల ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ఈ తుపానుల అనుభవం నిరూపించిందన్నారు. ఆర్టీజీఎస్, అవేర్ వ్యవస్థలను మరింత సమర్థంగా వినియోగించుకుంటూ భవిష్యత్తులోనూ విపత్తులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని తెలిపారు. మొత్తంగా తుపానుల సమయంలో ముందస్తు హెచ్చరికల నుంచి సహాయక చర్యలు, విద్యుత్ పునరుద్ధరణ వరకు ప్రతి దశలోనూ సమన్వయంతో పనిచేశామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం, విద్యుత్ సిబ్బంది, క్షేత్రస్థాయి అధికారుల సమష్టి కృషి వల్లే తక్కువ సమయంలో సాధారణ పరిస్థితులను తీసుకురాగలిగామని పేర్కొన్నారు.

## కంగ్రాట్స్ చంద్రబాబు టీమ్!

-మొదటిపేజీ తరువాయి

అద్భుతంగా ఎలా గెలవచ్చో నిరూపించినందుకు చంద్రబాబు టీమ్, పోలీసులు, ఎస్ఈసీకి కంగ్రాట్స్!" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. నామినేషన్ల దగ్గరి నుంచి మొదలుకొని స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణ, పోలింగ్ ఏజెంట్ల నియామకం, పోలింగ్ సరళి, పోలింగ్ శాతం, చివరకు కౌంటింగ్ వరకు ప్రతీ దశను అధికార పక్షం హైజాక్ చేసిందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోలేదని, అధికార పార్టీయే వారిని సెలెక్ట్ చేసిందని ఎద్దేవా చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో దేశంలో ఎన్నికల సంస్కరణలు ఎంత అవసరమో స్పష్టమవుతోందని జగన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి భారీ విజయం దిశగా దూసుకెళుతుండగా, వైసీపీ అనేకచోట్ల పరాజయం పాలవుతున్న నేపథ్యంలో జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభంజనం..
## జగన్ విధ్వంసానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారు

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి చారిత్రాత్మక విజయం సాధించడంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ విధ్వంసకర, అరాచక పాలనను ప్రజలు తమ ఓటుతో నిర్వద్వంద్వంగా తిరస్కరించారని, కూటమి ప్రభుత్వ సుపరిపాలన, అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారని ఆయన స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ గెలుపు ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ల సమష్టి నాయకత్వంపై ప్రజలు ఉంచిన అచంచల విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వం ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకొచ్చిందని పెమ్మసాని వివరించారు. పేదలకు ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు, దేశంలో ఎక్కడా లేని విధంగా వృద్ధులు, వికలాంగులకు అందిస్తున్న రూ.4,000, రూ.6,000 పెన్షన్లు, 'తల్లికి వందనం', 'దీపం', 'అన్నదాత సుఖీభవ' వంటి పథకాల ద్వారా సుమారు రూ.1,50,000 కోట్ల సంక్షేమాన్ని నేరుగా ప్రజలకే అందించామని తెలిపారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అమరావతి, పోలవరం వంటి ప్రాజెక్టుల నిర్మాణంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నామన్నారు. మెగా డీఎస్సీ, 'రాయలసీమ రైజింగ్' వంటి కార్యక్రమాలతో యువతకు, వెనుకబడిన ప్రాంతాలకు భరోసా ఇస్తున్నామని, మంత్రి నారా లోకేశ్ కృషితో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తున్నాయని కొనియాడారు.

### అరాచక పాలనకు, ప్రజాస్వామ్య పాలనకు తేడా ఇదే

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక ఎన్నికలకు, నేటి కూటమి పాలనలో జరిగిన ఎన్నికలకు నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని పెమ్మసాని ఎద్దేవా చేశారు. 2019 తర్వాత జగన్ ప్రభుత్వం ప్రత్యర్థులపై గంజాయి, హత్యాయత్నం కేసులు పెడతామని బెదిరించి, పెన్షన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపేస్తామని ఒత్తిడి చేసి నామినేషన్లు వేయనీయకుండా చేసిందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ వార్డులు కలిపి 1,44,000 స్థానాలకు గాను 50,000 స్థానాలను, అంటే 35 శాతం సీట్లను బలవంతంగా ఏకగ్రీవం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. నేడు కూటమి ప్రభుత్వంలో శ్రీకాకుళం నుంచి కుప్పం వరకు అత్యంత శాంతియుతంగా ఎన్నికలు జరిగాయని, ప్రజలు స్వేచ్ఛగా ఓటేశారని అన్నారు. ఫలితాలు వెల్లడైన 92 మున్సిపాలిటీల్లో 88 చోట్ల, అంటే 90 శాతానికి పైగా స్థానాల్లో ప్రజలు కూటమికి పట్టం కట్టారని వెల్లడించారు.

# జగన్ పాలనను జనం మర్చిపోలేదు..
# ఈవీఎం అయినా, బ్యాలెట్ అయినా తీర్పు కూటమికే

రాష్ట్రంలోని పురపాలక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి చారిత్రక విజయం దిశగా దూసుకుపోతోంది. దాదాపు 95 శాతం స్థానాలను కైవసం చేసుకుని, ప్రభుత్వంపై ప్రజలకున్న అచంచల విశ్వాసాన్ని మరోసారి నిరూపించుకుంది. ఈ అపూర్వ విజయంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనకు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు తమ ఓటు ద్వారా సంపూర్ణ ఆమోదముద్ర వేశారని ఆయన పేర్కొన్నారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విజయం కూటమి కార్యకర్తల అహర్నిశల శ్రమకు, ప్రజలు తమపై ఉంచిన నమ్మకానికి దక్కిన గుర్తింపు అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనా దక్షత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిబద్ధత, యువనేత నారా లోకేశ్ దార్శనికతతో పాటు రాష్ట్ర బీజేపీ నాయకత్వంపై ప్రజలకున్న తిరుగులేని విశ్వాసానికి ఈ ఫలితాలే ప్రత్యక్ష తార్కాణమని పల్లా శ్రీనివాసరావు అన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీల మధ్య ఉన్న పటిష్టమైన ఐక్యతకు, రాష్ట్ర ప్రగతికి కేంద్రం అందిస్తున్న సహకారానికి ప్రజలు జై కొట్టారన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీల జెండాలను భుజాన మోసి, గెలుపు కోసం అలుపెరగకుండా పనిచేసిన ప్రతి కార్యకర్తకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల ఆశీస్సులతో గెలుపొందిన అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

### జగన్ విధ్వంస పాలనను ప్రజలు ఇంకా మర్చిపోలేదు

జగన్ సాగించిన ఐదేళ్ల విధ్వంస పాలనను రాష్ట్ర ప్రజలు ఇంకా మర్చిపోలేదనడానికి ఈ ఫలితాలే నిదర్శనమని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన తీర్పునే పురపాలక ఎన్నికల్లోనూ ప్రజలు పునరావృతం చేశారని, వైసీపీ పాలన పట్ల ప్రజల్లో ఆగ్రహం ఏమాత్రం తగ్గలేదని అన్నారు. ఇప్పటికైనా ఆ 'గొడ్డలి పార్టీ' తమ తప్పుడు, విష ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. ఎన్నికలు జరగకుండా అడ్డుకునేందుకు వైసీపీ నేతలు ఏకంగా 62 పిటిషన్లను కోర్టుల్లో దాఖలు చేసి అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. "ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ, ఎక్కడో ఏదో జరిగిపోయిందంటూ ఫేక్ ప్రచారాలతో ప్రజలను భయపెట్టాలని చూశారు. కానీ, ప్రజలు చాలా విజ్ఞులు. ఎవరు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారో, ఎవరు మోసం చేస్తున్నారో వారికి పూర్తి స్పష్టత ఉంది. అందుకే వైసీపీని మరోసారి చిత్తుచిత్తుగా ఓడించారు" అని పల్లా పేర్కొన్నారు. ఈ ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో జరిగినా కూటమి పార్టీలకే ప్రజలు పట్టం కట్టారని, దీన్నిబట్టి ఈవీఎం అయినా, బ్యాలెట్ పేపర్ అయినా ప్రజల నమ్మకం కూటమిపైనే ఉందని నిరూపితమైందని పల్లా తెలిపారు.

## నీటిని వృధా చేయవద్దు- భవిష్యత్ తరాలకు నీటిని కాపాడండి



**హిందూపురం: ప్రజా జ్యోతి న్యూస్: నవంబర్ 3:** శ్రీ సత్యసాయి జిల్లా బ్యూరో అంజి: నీటి వనరులను సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని ఉపాధ్యాయులు గ్రామపంచాయతీ అధికారులు గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ పెనుగొండ ప్రతినిధులు సూచించారు నవంబర్ 3న నిర్వహించిన నీటి సంరక్షణ అవగాహన కార్యక్రమంలో భాగంగా హిందూపురం మండలం కె బసవనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు నీటి పొదుపు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా నీటి ప్రతి బొట్టు విలువైనదేనని భవిష్యత్తు తరాలకు నీటి కొరత లేకుండా చూడాలంటే ప్రస్తుత తరమే బాధ్యతగా వ్యవహరించాలని వివరించారు తాగునీటి పైపులు కుళాయిల లీకేజీలను వెంటనే అరికట్టడం నీటి ట్యాంకులు రిజర్వాయర్లను క్రమం తప్పకుండా తనిఖీ చేయడం వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు అలాగే చెరువులు కుంటలను సంరక్షించాలని వినియోగించిన నీటిని శుద్ధి చేసి తిరిగి అవసరాలకు ఉపయోగించుకోవాలని సూచించారు విద్యార్థులు తమ ఇళ్లలోనే కాకుండా గ్రామంలోని ప్రజలకు కూడా నీటి పొదుపు ప్రాధాన్యతను తెలియజేయాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గ్రామపంచాయతీ అధికారులు సిబ్బంది గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ పెనుగొండ ప్రతినిధులు విద్యార్థులు పాల్గొన్నారు

## రాయనపేటలో హోరెత్తిన జనసేన

## భారీ బైక్ ర్యాలీ..!

**జనసేన అభ్యర్థి విజయం ఖాయమని ధీమా..!**

**జనసేన నాయకులు పూనెం గోపాల్ సారధ్యంలో గెలుపు తథ్యం..!**



**ఎటపాక , నవంబర్ 03 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని రాయనపేట పంచాయతీలో జనసేన ఎంపీటీసీ అభ్యర్థి కురినాల సత్యవతి గెలుపు కోరుతూ మంగళవారం నాడు జనసేన మండల అధ్యక్షులు మారాసు గంగాధర్ సమక్షంలో జనసేన నాయకులు పూనెం గోపాల్ సారధ్యంలో గోలి శ్రీనివాస్ , మోరంపల్లి పెదబాబు , కురినాల శ్రీకాంత్ నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ హోరెత్తించింది. ఈ బైక్ ర్యాలీలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అధిక సంఖ్యలో జనసైనికులు వీర మహిళలు టిడిపి నాయకులు కదిలి వచ్చారు. ముందుగా వెంకటరెడ్డిపేట లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జనసేన మండల అధ్యక్షులు మారాసు గంగాధర్ కొమ్ము వెంకట్ కుమారస్వామి ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం బైక్ ర్యాలీని జనసేన నాయకులు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ బైక్ ర్యాలీ వెంకటరెడ్డిపేట నుండి ప్రారంభమై పాటిమాలగూడెం మంగువాయి తాటాకులగూడెం రాయనపేట మీదుగా దూగుట్ట పాత కొండిపల్లి , కొత్త కొండిపల్లి , కొత్తూరు నారాయణపురం , ఎర్రబోరు తుమ్మల నగర్ వరకు కోలాహలంగా సాగింది. జన ప్రభంజనమై సాగిన ఈ బైక్ ర్యాలీ హవాతో ఎటపాక మండలంలో రాయనపేట పంచాయతీ లో ఎంపీటీసీ స్థానం జనసేన జెండా ఎగురవేయడం పక్కా అని సంకేతాలు కనిపిస్తున్నాయి. దాంతో ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని పలువురు వాపోతున్నారు. ఈ కార్యక్రమంలో రాయనపేట పంచాయతీలోని జన సైనికులు వీర మహిళలు కూటమి నాయకులు బైక్ ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## తుఫాను వేళ నియోజకవర్గ ప్రజలకు భరోసాగా

## ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు



**బాపట్ల నవంబర్ 3 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** మురుసు తుఫాను ప్రభావంతో బాపట్ల నియోజకవర్గంలో వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజల భద్రతపై ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ప్రత్యేక దృష్టి సారించారు. బాపట్ల పట్టణంలోని మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న గుడిసెలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే ప్రమాదం ఉండటంతో ముందస్తుగా అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టారు. ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయించారు. స్వయంగా అక్కడికి చేరుకుని ప్రజలతో మాట్లాడి ధైర్యం చెబుతూ, బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి వారిని తరలించే ఏర్పాట్లను పర్యవేక్షించారు.అదేవిధంగా మురుసు తుఫాను ప్రభావంతో బాపట్ల రైల్వేస్టేషన్‌లో నిలిచిపోయిన రైలులోని ప్రయాణికుల పరిస్థితిని తెలుసుకుని వారికి అవసరమైన సహాయక చర్యలు చేపట్టారు. ఇబ్బందుల్లో ఉన్న ప్రయాణికులకు అండగా నిలిచి, సహాయక ఏర్పాట్లను పరిశీలించారు. తుఫాను సమయంలో నియోజకవర్గ ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఎమ్మెల్యే స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను పర్యవేక్షించారు.

# జగన్ పాలనలో చేసిన అభివృద్ధిని గుర్తు చేసుకుని ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి





**: ఎమ్మెల్యే విరుపాక్షి**

**చిప్పగిరి, నవంబర్ 3 (ప్రజా జ్యోతి)** గత ఐదేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేసుకుని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి ప్రజలను కోరారు. మంగళవారం చిప్పగిరి మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని వైఎస్సార్సీపీ జడ్పీటీసీ అభ్యర్థి ఉనేబది జ్యోతి, ఎంపీటీసీ–1 అభ్యర్థి చెరువు మహానంది, ఎంపీటీసీ–2 అభ్యర్థి కొలిమి సర్వర్ ఖాన్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.జగన్ ప్రభుత్వ హయాంలో పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని విరుపాక్షి పేర్కొన్నారు. ప్రజలకు మేలు చేసే పాలనకు మద్దతుగా నిలవాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజల గొంతుకగా నిలుస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చిప్పగిరి మండలంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జూటూరు మారయ్య, మండల కన్వీనర్ ఉనేబది మల్లికార్జున, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేసే అవకాశం ఇవ్వండి

**- ప్రతి గ్రామానికి రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేస్తా పల్లె దాహం తీర్చేందుకు మంచినీటి సరఫరా**

**- ఎన్నికల ప్రచారంలో దేవనకొండ జడ్పిటిసి అభ్యర్థి డాక్టర్ సాధిక సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని విన్నపం**

**- తనతో పాటు కూటమి ఎంపీటీసీ అభ్యర్థులను కూడా ఆశీర్వదించాలని చేతులు జోడించి కోరిన వైద్యురాలు**

**- విజయవంతంగా ముగిసిన ఎన్నికల ప్రచారం**







**దేవనకొండ : 03-10-2026:** దేవనకొండను అన్ని విధాల అభివృద్ధి చేసే అవకాశం ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ జెడ్పిటిసి అభ్యర్థి డాక్టర్ షేక్ సాధిక అన్నారు. మంగళవారం ఆమె టిడిపి మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్ గారు, టిడిపి సీనియర్ నాయకులు ఈదుల దేవరబండ సుభాన్ గారితో కలిసి దేవనకొండ మండలంలోని పి. కోటకొండ గ్రామంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటు అభ్యర్థించారు. కలిసిన ప్రతి ఒక్కరినీ అమ్మ.. అక్క.. అన్న.. అవ్వ తాత అంటూ ఆప్యాయంగా పలకరించి, మీ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తు పై వేసి తనను జడ్పిటిసిగా గెలిపించాలని చేతులు జోడించి అభ్యర్థించారు. ఎన్నికల్లో తనతో పాటు టిడిపి, కూటమి ఎంపీటీసీ అభ్యర్థులను కూడా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను జెడ్.పి.టి.సి. గా గెలిపిస్తే మండలంలోని ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యాలు మెరుగుపరిస్తానని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల రవాణా సౌకర్యం మెరుగుపడితే అభివృద్ధి సాధ్యం అవుతుందని వెల్లడించారు. అంతే కాకుండా పల్లె దాహం తీర్చేందుకు ప్రతి గ్రామంలో మంచినీటి వసతి కల్పించేందుకు పూర్తిస్థాయిగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. సిఎం చంద్రబాబు గారు, మంత్రి నారా లోకేష్ గారు, నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతి అక్క గారి సహకారంతో మండల పరిశు భ్రత, ప్రజల వైద్యం, ఆరోగ్యం కోసం కృషి చేస్తానని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తారని తెలిపారు. టిడిపి మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్ గారు, టిడిపి సీనియర్ నాయకులు ఈదుల దేవరబండ సుభాన్ మాట్లాడుతూ దేవనకొండ మండలం అభివృద్ధి సిఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని అన్నారు. సంక్షేమ పథకాలు అభివృద్ధిని చూసి సైకిల్ గుర్తుపై ఓటు వేసి జెడ్.పి.టి.సి. అభ్యర్థి డాక్టర్ షేక్ సాధిక తో పాటు టిడిపి, కూటమి ఎంపీటీసీ అభ్యర్థులను కూడా గెలిపించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారం, సౌకర్యాలు కల్పించేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి ఎంపీటీసీ అభ్యర్థులు, నాయకులు బండిగింజల రంగన్న, ఖాసీమ్, మధు, ఐటీడీపి రామాంజి, కార్యకర్తలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# దీపావళి బాణసంచా విక్రయాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి

**భద్రతా ప్రమాణాలు పాటించాలి**

**-- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చిట్టపులి నరేంద్ర పడాల్**

**చింతూరు నవంబర్ 3 ప్రజాజ్యోతి ప్రతినిధి రాజుపూసం**

దీపావళి పండుగ సందర్భంగా చింతూరు డివిజన్ పరిధిలో బాణసంచా విక్రయ దుకాణాలు ఏర్పాటు చేయాలనుకునే వ్యాపారులు సంబంధిత శాఖల నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతులు, లైసెన్సులు పొందాలని చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చిట్టపులి నరేంద్ర పడాల్, స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలందరూ దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో పాటు సురక్షితంగా జరుపుకునేలా బాణసంచా విక్రయదారులు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బాణసంచా దుకాణాల నిర్వహణలో ప్రభుత్వం నిర్దేశించిన భద్రతా ప్రమాణాలు, అగ్నిమాపక నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.బాణసంచా దుకాణాల ఏర్పాటుకు పాటించాల్సిన నిబంధనలు సూచించారు బాణసంచా దుకాణాల ఏర్పాటుకు రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖల నుంచి అవసరమైన ముందస్తు అనుమతులు, లైసెన్సులు పొందాలని .జనావాసాలకు దూరంగా, విశాలమైన బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు .హైటెన్షన్ విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సబ్‌స్టేషన్లకు దూరంగా దుకాణాలు నిర్వహించాలని .పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, రద్దీ ప్రాంతాలకు దూరంగా ఉండాలన్నారు.ప్రతి దుకాణంలో అగ్నిమాపక పరికరాలు, ఇసుక, నీటి బకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని .దుకాణాల పరిసరాల్లో సిగరెట్లు, బీడీలు, బహిరంగ మంటలు పూర్తిగా నిషేధమన్నారు.అనుమతించిన పరిమితిలో మాత్రమే బాణసంచా నిల్వ చేయాలని.ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా తగినంత ఖాళీ స్థలం, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేయాలని .లైసెన్స్ నిబంధనలకు అనుగుణంగా మాత్రమే విక్రయాలు నిర్వహించాలన్నారు

**ప్రజలు పాటించాల్సిన భద్రతా సూచనలు:** చిన్నపిల్లలు పెద్దల పర్యవేక్షణలో మాత్రమే బాణసంచా కాల్చాలని, కాటన్ దుస్తులు ధరించి, వదులుగా ఉండే సింథటిక్ దుస్తులకు దూరంగా ఉండాలని, బాణసంచా కాల్చే ప్రదేశంలో నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వెలగని టపాసులను తిరిగి వెలిగించే ప్రయత్నం చేయరాదన్నారు.చేతిలో పెట్టుకొని బాణసంచా కాల్చడం, ఇతరులపైకి విసరడం వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడరాదన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, పెంపుడు జంతువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సంబంధిత పోలీస్, అగ్నిమాపక, వైద్య సేవలను సంప్రదించాలని .అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారిచేసారు.చింతూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లు, పోలీస్ అధికారులు, అగ్నిమాపక శాఖ, ఇతర సంబంధిత శాఖల అధికారులు బాణసంచా దుకాణాల అనుమతులు, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని ప్రాజెక్టు అధికారి ఆదేశించారు. అనుమతులు లేకుండా దుకాణాలు నిర్వహించే వారిపై, భద్రతా నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అలాగే దీపావళి పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చింతూరు డివిజన్ స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌తో పాటు ప్రతి మండలంలోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి 24 గంటల



పాటు పరిస్థితులను పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అత్యవసర సమాచారాన్ని వెంటనే సంబంధిత శాఖలకు చేరవేసి, అవసరమైన సహాయక చర్యలు చేపట్టేలా సమన్వయ వ్యవస్థను సిద్ధం చేయాలని ఆదేశించారు.ప్రజలందరూ అధికారుల సూచనలు, భద్రతా నిబంధనలు పాటిస్తూ పర్యావరణహితంగా, ప్రశాంతంగా, ప్రమాదరహితంగా దీపావళి పండుగను జరుపుకోవాలని ప్రాజెక్టు అధికారి చిట్టపులి నరేంద్ర పడాల్,కోరారు.

# కూనవరంలో సీపీఐకి పెరుగుతున్న గెలుపు అవకాశాలు!

## ప్రచారం ముగిసే నాటికి గుజ్జా మోహన్‌రావుకు గ్రామాల్లో విశేష స్పందన

## మార్పు కోరుకుంటున్న ప్రజలు.. కంకి కొడవలి గుర్తుపై ఆసక్తి!





**కూనవరం: నవంబర్ 3, ( ప్రజా జ్యోతి ప్రతినిధి కిరణ్ బాబు )** కూనవరం మండల జడ్పీటీసీ ఎన్నికల ప్రచారం నేటితో ముగియడంతో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. జడ్పీటీసీ స్థానానికి సీపీఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుజ్జా మోహన్‌రావుకు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రచార సమయంలో విశేష ప్రజాస్పందన లభించినట్లు తెలుస్తోంది. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, పాలకులపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి ఎన్నికల ప్రచారంలో ప్రధాన చర్చనీయాంశాలుగా మారాయి.మండలంలోని అనేక గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రహదారులు, తాగునీటి ఇబ్బందులు, విద్యుత్ సమస్యలు, రైతుల కష్టాలు ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లలో కూడా గ్రామాల పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదని, ఎన్నో ఏళ్లుగా ఓట్లు వేసి గెలిపించిన నాయకులు తమ సమస్యల పరిష్కారానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన యువతీ యువకుల సమస్యలు, వారి హక్కులకు సంబంధించిన అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ సీపీఐ పోరాటాలు నిర్వహించిందనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా సీపీఐ నిలిచిందని పలువురు గుర్తుచేస్తున్నారు.ఈ నేపథ్యంలో ఈసారి జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మార్పు కోరుకుంటున్నామని, సీపీఐ అభ్యర్థికి మద్దతు తెలుపుతామని పలువురు గ్రామస్థులు ప్రచారంలో తమ అభిప్రాయాలను వెల్లడించినట్లు పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి.ప్రచారం ముగిసే సమయానికి గ్రామాల్లో కనిపించిన స్పందన, రోజురోజుకూ మారుతున్న రాజకీయ సమీకరణాలు సీపీఐ అభ్యర్థి గుజ్జా మోహన్‌రావుకు అనుకూలంగా మారుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. కంకి కొడవలి గుర్తుపై ఓటర్ల ఆసక్తి పెరుగుతుండటంతో కూనవరం జడ్పీటీసీ ఎన్నికల్లో సీపీఐ గెలుపు అవకాశాలపై ఉత్కంఠ నెలకొంది. అయితే ప్రజల తుది తీర్పు ఎలా ఉండబోతోందన్నది ఎన్నికల ఫలితాల వరకు వేచి చూడాల్సిందే.

# ఓవైపు ఎన్నికలు. మరోవైపు తుఫాను ప్రజల క్షేమంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

### జ్వరంతోనూ క్షేత్రస్థాయిలో కలెక్టర్ పర్యటన.

### జిల్లా వ్యాప్తంగా తుఫాను సహాయక చర్యలపై పర్యవేక్షణ



**బాపట్ల నవంబర్ 3 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** మురసు తుఫాను నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేపట్టారు. జ్వరంతో అస్వస్థతకు గురైనప్పటికీ, స్థానిక సంస్థల ఎన్నికలు, కౌంటింగ్ బాధ్యతలతో పాటు తుఫాను పరిస్థితులను సమీక్షిస్తూ ప్రజలకు అందుతున్న సహాయక చర్యలను పరిశీలించడం ప్రాధాన్యత సంతరించుకుంది.తుఫాను ప్రభావంతో జిల్లాలోని లోతట్టు, ముంపు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఇందులో భాగంగా బాపట్ల మండలంలోని రామ్ నగర్ ప్రాథమిక పాఠశాల, కొండుబొట్లవారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న ప్రజలతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. భోజన వసతులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు.జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన ఆహారం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు, అనారోగ్యంతో ఉన్నవారి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. తుఫాను తీవ్రతను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అవసరమైన ప్రాంతాల్లో ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.ఒకవైపు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్ ఏర్పాట్లు, మరోవైపు మురసు తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సహాయక చర్యలు.. ఇలా విభిన్న బాధ్యతల మధ్య కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితులను సమీక్షించారు. కార్యాలయాలకే పరిమితం కాకుండా పునరావాస కేంద్రాలకు వెళ్లి బాధితుల పరిస్థితులను నేరుగా తెలుసుకోవడం ద్వారా సహాయక చర్యల అమలును పరిశీలించారు.విపత్తుల సమయంలో ప్రజలకు ప్రభుత్వ యంత్రాంగం అండగా నిలవడం అత్యంత అవసరం. జిల్లా వ్యాప్తంగా తుఫాను పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు ప్రాధాన్యతనిస్తూ సహాయక చర్యలు కొనసాగించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా ఆయా శాఖల అధికారులు ఉన్నారు

# అనంతగిరి వై.సి.పి జెడ్పి.టి.సి అభ్యర్థి దూరు జయవర్ధిని సుడిగాలి ప్రచారం

### హోరెత్తిన వీధులు, వెల్లువెత్తిన ప్రజామద్దతు.



**అనంతగిరి మండలం. నవంబర్ 3.ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్. అల్లూరి సీతారామరాజు జిల్లా.** అనంతగిరి మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెడ్పి.టి.సి అభ్యర్థి దూరు జయవర్ధిని చేపట్టిన ఎన్నికల ప్రచార భేరి సుడిగాలిలా కొనసాగింది. మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన విస్తృత పాదయాత్ర ఇంటింటి ప్రచారంలో ప్రజల నుంచి అపూర్వ స్పందన, వాలసి గ్రామంలో దింసా నృత్యాలతో అభినందనలు వెల్లువెత్తాయి. ప్రచారానికి విచ్చేసిన దూరు జయవర్ధినికి ఆయా గ్రామాల ప్రజలు, మహిళలు హారతులు పట్టి, పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ప్రచార బాటలో ప్రతి ఇంటా పలకరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. ప్రతి వీధిలోనూ వైసిపి శ్రేణులు, అభిమానులు చేసిన జైకారాలతో వాతావరణం హోరెత్తింది.ఈ సందర్భంగా దూరు జయవర్ధిని మాట్లాడుతూ జడ్పీ.టీ.సీగా నన్ను గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామ సేవకే నా సమయాన్ని అంకితం చేస్తానని స్థానిక మౌలిక వసతుల కల్పన, రోడ్లు, తాగునీరు. విద్యుత్ సమస్యల శాశ్వత పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు.

### అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం నాయకులు, కార్యకర్తలు

ఈ ప్రచారంలో పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక కార్యకర్తలు మరియు యువత పెద్ద ఎత్తున పాల్గొని అభ్యర్థి జయవర్ధిని సౌమ్యురాలు, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తి కావడం వలన ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తుండడంతో భారీ మెజార్టీతో జెడ్పిటిసి స్థానాన్ని గెలుచుకోవడం ఖాయమని నాయకులు ధీమా వ్యక్తం చేశారు.ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, దూరు జయవర్ధిని ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ శ్రేణులు ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొర్ర సూర్యనారాయణ మండల ప్రధాన కార్యదర్శి డొనేరు దానియేలు ఎంపిటిసి అభ్యర్థులు రేగబోయిన స్వామి సేంబి కౌసల్య మండల పరిశీలకులు లుంగపర్తి మాజీ సర్పంచ్ జన్మి సన్యాసిరావు సేంబి సన్యాసిరావు మాజీ సర్పంచ్ బాక గురుమూర్తి కేరంగి ధర్మన్న బోయిన సన్యాసిరావు పాటి రవికుమార్ దారపి దుక్కు నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

## తుఫాన్ సహాయక చర్యల్లో తహసీల్దార్

**సిబ్బందితో కలిసి చెట్ల తొలగింపులో స్వయంగా పాల్గొన్న సలీమా**



**బాపట్ల నవంబర్ 3 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** మురసు తుఫాను ప్రభావంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం చేపట్టిన సహాయక చర్యల్లో తహసీల్దార్ సలీమా ప్రత్యేకంగా నిలిచారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ ఆదేశాల మేరకు బాపట్ల,జమ్ములపాలెం రహదారిపై ఈదురుగాలులకు విరిగిపడిన భారీ వృక్షాలను తొలగించేందుకు రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆమె రంగంలోకి దిగారు.కేవలం అధికారిక పర్యవేక్షణకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలోకి వెళ్లి సిబ్బందితో కలిసి రహదారిపై అడ్డుగా ఉన్న చెట్ల తొలగింపు పనుల్లో స్వయంగా పాల్గొన్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టారు. తుఫాను విపత్కర పరిస్థితుల్లో విధి నిర్వహణలో బాధ్యతను చాటుతూ సహాయక చర్యల్లో స్వయంగా భాగస్వామి కావడంపై స్థానికులు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.

## అబోతులపేటలో ఘనంగా అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠ

**– కుంకుమ పూజలు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షులు స్వామి శ్రీనివాస నంద సరస్వతి**



**జి సిగడాం, ప్రజాజ్యోతి న్యూస్:** జి.సిగడం మండలం ఆనంద పురం పంచాయతీ పరిధిలోని అబోతులపేట గ్రామంలో శ్రీ అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షులు స్వామి శ్రీనివాస నంద సరస్వతి ఆంజనేయ స్వామివారికి ప్రత్యేకంగా కుంకుమ పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చనలు భక్తుల జయజయధ్వానాల మధ్య పూజా కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగాయి.ఈ వేడుకలో గ్రామంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 100 మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల భాగస్వామ్యంతో విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## లెప్రసీ కేసుల గుర్తింపు సర్వేను వేగవంతం చేయాలి




**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 3 (ప్రజాజ్యోతి)** లెప్రసీ కేసుల గుర్తింపు సర్వేను వేగవంతం చేసి, 2027 నాటికి కుష్ఠ వ్యాధి నిర్మూలన లక్ష్యంగా పనిచేయాలని ఫిజియోథెరపిస్ట్ విక్టర్ మనోహర్ ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. బద్వేల్ మండలం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అనుమానిత కేసులను త్వరగా గుర్తించి, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల్లో అంగవైకల్యం రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్, క్షయ వ్యాధుల నివారణకు కూడా ప్రతి ఒక్కరూ చురుకుగా సర్వేలో పాల్గొనాలని తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ శంభో ప్రసాద్ లెప్రసీ వ్యాధి లక్షణాలు, వ్యాప్తి చెందే విధానం గురించి వివరించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.వెంగయ్య మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణలో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవసరమైన వైద్య సేవలు అందించాలని, చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలని సూచించారు. పిల్లల బరువు, ఎత్తును క్రమం తప్పకుండా పరిశీలిస్తూ పోషకాహారం, నిమోనియా నివారణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. హోమ్ బేస్డ్ న్యూబోర్న్ కేర్, హోమ్ బేస్డ్ యంగ్ చైల్డ్ కేర్ వివరాలను ఈ-ఆశా యాప్‌లో ప్రతిరోజూ నమోదు చేయాలని తెలిపారు. అలాగే గర్భిణుల ముందస్తు నమోదు, మాతా శిశు మరణాల నివారణ, అయోడిన్ లోపం నివారణకు అయోడైజ్డ్ ఉప్పు వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో, ఆసుపత్రుల్లో పొగాకు వినియోగం నిషేధమనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని, బ్రిక్స్ కార్యక్రమంలో భాగంగా నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు 'మేరా లైఫ్' కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సులోచన, విలేజ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మురసు తుఫానుపై ఎస్పీ ప్రత్యేక పర్యవేక్షణ

## క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సహాయక చర్యల సమీక్ష. 333 చెట్ల తొలగింపు

## 224 మంది పోలీసు సిబ్బందితో 18 క్యూఆర్టీ బృందాలు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు పోలీసుల అండ

## వరద ప్రవాహాల వద్ద అప్రమత్తంగా ఉండాలి. ప్రజలకు ఎస్పీ బి.ఉమామహేశ్వర్ సూచన




**బాపట్ల నవంబర్ 3 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** మురసు తుఫాను నేపథ్యంలో బాపట్ల జిల్లాలో ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు జిల్లా పోలీసు యంత్రాంగం చేపట్టిన చర్యలను జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ స్వయంగా పర్యవేక్షించారు. మంగళవారం తుఫాను ప్రభావిత ప్రాంతాలైన చీరాల, రామాపురం, వాడరేవు బీచ్ ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున పర్యాటకులు, ప్రజలు తీర ప్రాంతాలకు వెళ్లకుండా చూడాలని, తుఫాను ప్రభావం పూర్తిగా తగ్గేవరకు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.తుఫాను ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసిన ఎస్పీ, జిల్లా పోలీస్ క్యాంపు కార్యాలయంలో ఇద్దరు సీఐల ఆధ్వర్యంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి జిల్లాలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేందుకు 224 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో 18 క్విక్ రెస్పాన్స్ టీమ్ (క్యూఆర్టీ) బృందాలను ఏర్పాటు చేశారు.తుఫాను అనంతరం వీచిన బలమైన ఈదురుగాలులకు జిల్లావ్యాప్తంగా రోడ్లపై, నివాస గృహాలపై మొత్తం 333 చెట్లు నేలకొరిగాయి. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది వెంటనే స్పందించి పడిపోయిన చెట్లతో పాటు హోర్డింగ్‌లను తొలగించారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ముంపు ప్రమాదం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి లోతట్టు ప్రాంతాల ప్రజలను పోలీసు వాహనాల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జిల్లాలోని 67 పునరావాస కేంద్రాలకు 2,650 మందిని చేర్చారు. అత్యవసర సహాయక చర్యల కోసం సముద్ర తీర ప్రాంతాల్లో రెండు ఎన్డీఆర్ఎఫ్, రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచారు.తుఫాను తీరం దాటినప్పటికీ జిల్లాకు వరద ముప్పు పూర్తిగా తొలగిపోలేదని ఎస్పీ తెలిపారు. పల్నాడు, ప్రకాశం తదితర ఎగువ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా వాగులు, వంకల ద్వారా వరద నీరు బాపట్ల జిల్లాలోని తీర ప్రాంతాలకు చేరుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. లోలెవల్ బ్రిడ్జిలపై నుంచి వరద నీరు ప్రవహించే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఇప్పటికే ఇంకొల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగండ్ల వాగు వద్ద, బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సూర్యలంక రహదారిపై ఉన్న లోలెవల్ బ్రిడ్జి వద్ద వరద నీరు ప్రవహిస్తుండటంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మార్టూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి-16పై సుమారు నాలుగు అడుగుల మేర వరద నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ప్రస్తుతం నీటి ఉధృతి తగ్గడంతో రాకపోకలను పునరుద్ధరించారు.వరద ప్రవాహాలు ఉధృతంగా ఉన్న సమయంలో వాగులు, వంకలు, లోలెవల్ బ్రిడ్జిలను దాటి వెళ్లేందుకు ప్రయత్నించవద్దని ఎస్పీ ప్రజలకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం జిల్లా పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ నంబర్ 8333813228 లేదా డయల్ 112కు సమాచారం అందించాలని కోరారు.ఈ పర్యటనలో అడిషనల్ ఎస్పీ ఎల్.సుధాకర్, చీరాల డీఎస్పీ ఎం.డి.మోయిన్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పార్టీకి మూడు దశాబ్దాల సేవలు.. జెడ్పీ చైర్మన్ పదవిపై ఉలిగయ్య ఆశలు!

## కార్యకర్త నుంచి జిల్లా స్థాయి నాయకుడిగా ఎదిగిన రాజకీయ ప్రస్థానం..

## కౌతాళం జెడ్పీటీసీ బరిలో సీనియర్ నేత





**కౌతాళం, నవంబర్ 03 ప్రజా జ్యోతి** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, కార్యకర్తగా ప్రారంభమైన రాజకీయ ప్రస్థానాన్ని అంచెలంచెలుగా విస్తరించుకుంటూ జిల్లా స్థాయి నాయకుడిగా ఎదిగిన సీనియర్ టీడీపీ నేత ఉలిగయ్య ఇప్పుడు జిల్లా పరిషత్ చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా పార్టీకి, కార్యకర్తలకు అండగా నిలుస్తూ వస్తున్న ఆయన రాజకీయ అనుభవం ప్రస్తుతం మంత్రాలయం నియోజకవర్గ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

### ఎన్టీఆర్ అభిమానిగా మొదలై.. పార్టీ అధ్యక్షుడిగా ఎదిగి!

దివంగత నందమూరి తారక రామారావు అభిమానిగా తెలుగుదేశం పార్టీతో అనుబంధం ఏర్పరచుకున్న ఉలిగయ్య, పార్టీ ఆవిర్భావం నుంచే కార్యకర్తగా సేవలందించారు. 1996లో కౌతాళం సింగిల్ విండో అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి రైతులకు, అన్నదాతలకు, కార్యకర్తలకు, ప్రజలకు సేవలందించారు. 2002లో తన సతీమణిని మండల పరిషత్ అధ్యక్షురాలిగా (ఎంపీపీ) గెలిపించుకున్నారు. 1998 నుంచి 2025 వరకు కౌతాళం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి కృషి చేశారు.

### టికెట్ ఆశించినా.. పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేసిన నేత!

2009లో కొత్తగా మంత్రాలయం నియోజకవర్గం ఏర్పడిన సమయంలో ఎమ్మెల్యే టికెట్ ఆశించిన ఉలిగయ్యకు చివరి నిమిషంలో అవకాశం దక్కలేదు. పార్టీ అధిష్టానం బాలనాగిరెడ్డికి టికెట్ కేటాయించడంతో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేశారు. అయితే ఎన్నికల్లో గెలిచిన అనంతరం ఎమ్మెల్యే పార్టీ మారడంతో నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచారు.అధికారం లేకపోయినా నిరుత్సాహపడకుండా కౌతాళం మండలంలో పార్టీ ఉనికిని కాపాడుతూ సింగిల్ విండో, ఎంపీపీ, జడ్పీటీసీ వంటి స్థానాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేశారు.

### 2014, 2019లోనూ పార్టీ నిర్ణయమే శిరోధార్యం!

2014 ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, కాంగ్రెస్ నుంచి టీడీపీలోకి వచ్చిన తిక్కారెడ్డికి అధిష్టానం అవకాశం కల్పించింది. అయినప్పటికీ పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తూ మండల పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. పార్టీ అప్పగించిన వాల్మీకి ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ పదవిలోనూ సేవలందించారు.2019 ఎన్నికల్లోనూ టికెట్ ఆశించినప్పటికీ పార్టీ మరోసారి తిక్కారెడ్డికే అవకాశం ఇచ్చింది. ఆ సమయంలో వైసీపీ రాజకీయ ఒత్తిళ్లు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ టీడీపీ కార్యకర్తలకు ధైర్యం చెబుతూ పార్టీ కోసం పనిచేశారు.

### 2024లో బీసీ నినాదంతో టికెట్ ఆశలు.. అయినా పార్టీకి అండగా!

2024 ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించాలనే నినాదంతో ఎమ్మెల్యే టికెట్ ఆశించినప్పటికీ పార్టీ రాఘవేంద్రరెడ్డికి అవకాశం కల్పించింది. అయినా పార్టీ అభ్యర్థి విజయానికి తనవంతు కృషి చేస్తూ కార్యకర్తలను సమన్వయం చేశారు. తన కుమారుడు సురేష్ నాయుడిని మండల పార్టీ అధ్యక్షుడిగా కొనసాగిస్తూ పార్టీకి మరింత బలం చేకూర్చే ప్రయత్నం చేస్తున్నారు.ప్రస్తుతం జిల్లా తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకుడిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసా గుతూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారు.

### జెడ్పీ చైర్మన్ పదవిపై ఉలిగయ్య ఆశలు!

ప్రస్తుతం కౌతాళం జడ్పీటీసీ స్థానం బీసీ జనరల్‌కు రిజర్వ్ కావడంతో ఉలిగయ్య జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తూ జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, పార్టీ పట్ల విధేయత, కార్యకర్తలతో ఉన్న అనుబంధం తనకు ఈ పదవికి అర్హత కల్పిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉండగా, జిల్లా పరిషత్ చైర్మన్ రేసులో ఉన్న కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడు ఈ.కె. రుద్రఫణి నామినేషన్ క్రిష్ణగిరి మండలంలో ఓటు లేదనే కారణంతో తిరస్కరణకు గురైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పరిణామంతో చైర్మన్ పదవికి ఉలిగయ్యకు మార్గం సుగమమైందనే ప్రచారం జోరందుకుంది. అయితే చైర్మన్ పదవిపై తుది నిర్ణయం పార్టీ అధిష్టానం, ఎన్నికల ఫలితాలు, రాజకీయ సమీకరణాలపై ఆధారపడి ఉండనుంది.

### అన్ని వర్గాలతో కలిసిపోయే నాయకుడిగా గుర్తింపు!

మంత్రాలయం నియోజకవర్గంలో ఉలిగయ్యకు ప్రత్యేక గుర్తింపు ఉందని ఆయన అనుచరులు చెబుతున్నారు. వయస్సు, కులం, వర్గం అనే తేడాలు లేకుండా ప్రతి ఒక్కరితో కలిసిపోయే స్వభావం, అన్ని పార్టీల నాయకులతోనూ సత్సంబంధాలు కలిగి ఉండటం ఆయనకు ఉన్న బలంగా పేర్కొంటున్నారు. కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయనకు పేరు ఉందని స్థానిక రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.ఈ నేపథ్యంలో ఉలిగయ్య రాజకీయ అనుభవం, పార్టీ కోసం చేసిన సేవలు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దృష్టికి వెళ్లాయని ఆయన వర్గీయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### గెలుపే లక్ష్యంగా ప్రచారం.. ప్రజల తీర్పుపైనే ఆశలు!

జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉలిగయ్య గడపగడపకు వెళ్లి ప్రజలను కలుస్తూ, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీలు, సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం పనిచేసిన తనకు ప్రజలు అండగా నిలవాలని కోరుతున్నారు.ప్రచారం ముగియడంతో పోలింగ్‌కు అభ్యర్థులు కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. ఇన్నేళ్ల రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న ఉలిగయ్యకు ఈ ఎన్నికలు కీలకంగా మారాయి.గతంలో చేజారిన రాజకీయ అవకాశాలు ఇప్పుడు దక్కుతాయా? జెడ్పీ చైర్మన్ పదవిని అధిరోహించే అవకాశం లభిస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. చివరకు గెలుపు ప్రజల చేతుల్లోనే ఉందని, ప్రజల ఆశీర్వాదంతో జెడ్పీటీసీగా విజయం సాధించి పార్టీకి మరింత సేవ చేయాలన్నదే తన ఆకాంక్ష అని ఉలిగయ్య పేర్కొంటున్నారు.

# తుఫానుతో రైలులో చిక్కుకున్న ప్రయాణికులకు ఆహార పంపిణీ

## ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పిలుపుమేరకు శీలం శ్రీనివాసరావు సేవా కార్యక్రమం

**బాపట్ల నవంబర్ 3 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** మురసు తుఫాను ప్రభావంతో బాపట్ల రైల్వేస్టేషన్‌లో నిలిచిపోయిన రైలులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు బాపట్ల పట్టణ తెలుగుదేశం పార్టీ జనరల్ సెక్రటరీ శీలం శ్రీనివాసరావు ఆహారం, తాగునీరు అందజేశారు. బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పిలుపు మేరకు తన కుటుంబ సభ్యులతో కలిసి రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఆయన, రైలులో ఉన్న ప్రయాణికులందరికీ పులిహోర, దద్దోజనం ప్యాకెట్లతో పాటు తాగునీరు పంపిణీ చేశారు.తుఫాను కారణంగా రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి వారికి అవసరమైన ఆహారాన్ని అందించడం ద్వారా మానవతా దృక్పథంతో సేవలందించారు. ప్రయాణికుల అవసరాలను తెలుసుకుంటూ వారికి భోజనం, మంచినీరు అందించారు. తుఫాను సమయంలో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఎమ్మెల్యే ఆదేశాలతో చేపట్టిన ఈ సహాయక కార్యక్రమంలో శీలం శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు కూడా భాగస్వాములయ్యారు.



# వర్షాల నేపథ్యంలో చింతూరు డివిజన్‌లో న్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల మార్పు

## సవరించిన కేంద్రాలను గమనించి ఎన్నికల సిబ్బంది విధులకు హాజరుకావాలి

## -- సబ్ కలెక్టర్ చిట్టిపులి నరేంద్ర పడాల్



**చింతూరు నవంబర్ 3 ప్రజాజ్యోతి ప్రతినిధి రాజుపూసం** ప్రస్తుత వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశాల మేరకు చింతూరు డివిజన్ పరిధిలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను మార్పు చేసినట్లు సబ్ కలెక్టర్ చిట్టిపులి నరేంద్ర పడాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**సవరించిన పంపిణీ కేంద్రాల వివరాలు:**

కూనవరం మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల, కూనవరం; చింతూరు మండలానికి ఏ పీ టి డబ్ల్యూ ఆర్, జూనియర్ కళాశాల, చింతూరు; వి.ఆర్.పురం మండలానికి మినీ గురుకులం, రేకపల్లి; ఎటపాక మండలానికి ఎంపీడీవో, కార్యాలయ ప్రాంగణంలోని ఏ బి హెచ్, స్కూల్, కూనవరం (ఎటపాక)లో పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

# ఒక్కసారి అవకాశం ఇవ్వండి గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

## -సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించండి

## టీడీపి ఎంపిటిసి -2 అభ్యర్థి బాపురం బోయ శ్రీనివాసులు




**నందవరం, నవంబర్ 03 (ప్రజా జ్యోతి ):**ఒక్కసారి అవకాశం ఇవ్వండి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ-2 అభ్యర్థి బాపురం బోయ శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధిలోని హాలహర్వి పంచాయతీలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ-2 అభ్యర్థి బాపురం బోయ శ్రీనివాసులు, టిడిపి నాయకులతో కలసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకొని సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హామీల అమలులో ప్రజలకు అన్యాయం జరిగిందని, సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ గా అందుతున్నాయని ఎంపీటీసీ 2 గా గెలిపిస్తే ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హాలహర్వి పంచాయతీ బాపురం,జాగ్గాపురం, ధర్మపురం, హాలహర్వి ఓటర్లను సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఘట్టాల రంగన్న, గడంగ నరసింహులు, బాపురం కుమ్మరి కృష్ణ, బద్రి నీలకంఠ,ఎస్ఐసి గోపాల్, తిమ్మప్ప, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జగ్గాపురం గ్రామంలో వైసీపీ ఇంటింటి ప్రచారం జోరు

**నందవరం నవంబర్ 03(ప్రజా జ్యోతి ):** మండల పరిధిలోని జగ్గాపురం గ్రామంలో కోతి ఈరన్న, ఎల్లారెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం జోరుగా కొనసాగుతోంది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆశీస్సులతో ఎమ్మిగనూరు ఇన్చార్జ్ రాజీవ్ రెడ్డి ఆదేశాల మేరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది. టిడిపి చేసిన మోసాలను అమ్మ ఒడి సంబంధించి ప్రతి ఒక్క విద్యార్థికి 15000 అని చెప్పి 13000 వేయడం జరుగుతుందని అదేవిధంగా అన్నదాత సుఖీభవ సంవత్సరానికి ఒకే సారి 20.000 రైతు అకౌంట్ లోకి వేస్తానని చెప్పి ఇప్పుడు ఆరు నెలలకు ఒకసారి 6000 రైతు అకౌంట్ లోకి వేయడం జరుగుతుందని అందుకోసమే టిడిపి పార్టీకి గుణపాఠం చెప్పాలని ఓటర్ల కు తెలియజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ ప్రజలను కలుసుకుంటూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు మద్దతు తెలపాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. గ్రామంలోని ప్రజలతో మమేకమవుతూ తమ పార్టీ విధానాలు, హామీలను వివరిస్తూ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ నాయకులు చిన్న రాముడు. నాగేష్. ఉరుకుందు. గిద్దయ్య. ఈరన్న. శంకర్.చంద్రశేఖర్. హనుమంతు. రాఘవేంద్ర. భీమన్న, మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# ఘన విజయం బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి విజి ఉషా గంగా కి శుభాకాంక్షలు

## -- వాల్మీకి ముద్దుబిడ్డ ఎల్లంబీడు లక్ష్మన్న



**ఎమ్మిగనూరు, నవంబర్ 03 (ప్రజా జ్యోతి ):** స్థానిక పట్టణంలో మున్సిపల్ ఎన్నికల్లో 815 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించిన 29వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి విజి దయాసాగర్ సతీమణి విజి ఉషా గంగా కి వాల్మీకి ముద్దుబిడ్డ ఎల్లంబీడు లక్ష్మన్న హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ముందుగా కమిటీ రోడ్డులో భారీ ఎత్తున బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి,కౌన్సిలర్ విజి ఉషా గంగా సహకారంతో తాగునీరు, రహదారులు పారిశుధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని సూచించారు.ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ వార్డు అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ విజయం సాధించిన బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థివిజి ఉషా గంగాకి మరోసారి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యూసఫ్,రాజు,శేఖర్,శీను,రాజు ధర్మ తేజ, కాసిం నాయుడు,తదితరులు పాల్గొన్నారు.

## తుఫాను బాధితులకు అండగా ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక చర్యలు

మంత్రి గొట్టిపాటితో మాట్లాడి విద్యుత్ పునరుద్ధరణకు ఆదేశాలు



**పర్చూరు నవంబర్ 3 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** మురుసు తుఫాను కారణంగా పర్చూరు నియోజకవర్గంలో విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినడంతో సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించేందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చర్యలు చేపట్టారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో మాట్లాడి పరిస్థితిని వివరించగా, ఆయన ఈఎన్‌సీ, ఎస్‌ఈలతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. తుఫాను ప్రభావంతో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి, వైర్లు తెగిపడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి మరమ్మతు పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. అదే సమయంలో బాధితులకు అవసరమైన సహాయం అందించాలని టీడీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలోని చిన్నగంజాం, ఇంకొల్లు, పర్చూరు, మార్టూరు మండలాల్లో నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు చేపట్టారు. బాధితులకు అల్పాహారం, భోజనం, తాగునీరు, వసతి కల్పిస్తున్నారు. ప్రమాదకర ప్రాంతాల నుంచి వందలాది మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తూ, రహదారులపై కూలిన చెట్లను తొలగిస్తున్నారు. వరద నీటిని తొలగించేందుకు కూడా చర్యలు చేపట్టారు. పర్చూరు గ్రామంలో బాపట్ల ఆర్డీఓ హరిప్రసాద్, తహసీల్దార్ బ్రహ్మయ్య, విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాల మేరకు స్థానిక నాయకులు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అవసరమైన సేవలు అందిస్తున్నారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.

## జగ్గాపురం గ్రామంలో వైసీపీ ఇంటింటి ప్రచారం జోరు



**నందవరం నవంబర్ 03(ప్రజా జ్యోతి ):** మండల పరిధిలోని జగ్గాపురం గ్రామంలో కోతి ఈరన్న, ఎల్లారెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం జోరుగా కొనసాగుతోంది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆశీస్సులతో ఎమ్మిగనూరు ఇన్చార్జ్ రాజీవ్ రెడ్డి ఆదేశాల మేరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది. టిడిపి చేసిన మోసాలను అమ్మ ఒడి సంబంధించి ప్రతి ఒక్క విద్యార్థికి 15000 అని చెప్పి 13000 వేయడం జరుగుతుందని అదేవిధంగా అన్నదాత సుఖీభవ సంవత్సరానికి ఒకే సారి 20.000 రైతు అకౌంట్ లోకి వేస్తానని చెప్పి ఇప్పుడు ఆరు నెలలకు ఒకసారి 6000 రైతు అకౌంట్ లోకి వేయడం జరుగుతుందని అందుకోసమే టిడిపి పార్టీకి గుణపాఠం చెప్పాలని ఓటర్ల కు తెలియజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ ప్రజలను కలుసుకుంటూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు మద్దతు తెలపాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. గ్రామంలోని ప్రజలతో మమేకమవుతూ తమ పార్టీ విధానాలు, హామీలను వివరిస్తూ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ నాయకులు చిన్న రాముడు. నాగేష్. ఉరుకుందు. గిడ్డయ్య. ఈరన్న. శంకర్.చంద్రశేఖర్. హనుమంతు. రాఘవేంద్ర. భీమన్న, మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## గుంతకల్లు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా టీడీపీ అభ్యర్థి యశోద గౌడ్ విజయం

వైస్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకున్న టీడీపీ.. కార్యకర్తల్లో సంబరాలు

**గుంతకల్లు నవంబర్ 3 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ చైర్‌పర్సన్ అభ్యర్థి యశోద గౌడ్ 5000 ఓట్లు పై చీలికతో విజయం సాధించారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఆమె గెలుపొందడంతో టీడీపీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. యశోద గౌడ్ విజయం సాధించడంతో గుంతకల్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం టీడీపీ ఖాతాలో చేరింది. గుంతకల్ పట్టణ అభివృద్ధి చేస్తానని ఆమె అన్నారు.



# కంబదూరులో వైఎస్సార్‌సీపీ భారీ రోడ్‌షో.. అభ్యర్థుల ప్రచార హోరు

**ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి**

**కంబదూరు నవంబర్:3(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్, కంబదూరు:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కంబదూరు మండల కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో భారీ రోడ్‌షో నిర్వహించారు.కంబదూరులోని చెక్‌పోస్ట్ సర్కిల్ నుంచి ప్రారంభమైన రోడ్‌షో పాత పోస్టాఫీస్, పాత బస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తలారి సాయి హర్ష హాజరయ్యారు. పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద





సంఖ్యలో పాల్గొని రోడ్‌షోలో ఉత్సాహంగా ముందుకు సాగారు.ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల జడ్పీటీసీ అభ్యర్థి నూతిమడుగు అరుణ, ఎంపీటీసీ అభ్యర్థులు పి. దాదు, శకుంతలమ్మ, అమృత, గాజుల రామాంజనేయులు ప్రజలను కలిసి ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులకు సంబంధించిన ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.ఈ రోడ్‌షోలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# కంచుకోటలో కదం తొక్కిన ఎర్రదండు!

**హోరెత్తిన ప్రచారం.. వర్షాన్ని సైతం లెక్కచేయని శ్రేణులు అచ్యుతపురం నుంచి గన్నవరం వరకు సీపీఐ, వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీ**

**రెపరెపలాడిన సీపీఐ, వైఎస్సార్‌సీపీ జెండాలువిజయోత్సవాన్ని తలపించిన ప్రచార ముగింపు**

**సున్నం పున్నమ్మ, కాకా కామేశ్వరి గెలుపే లక్ష్యంగా కార్యకర్తల నినాదాలు కదం తొక్కిన శ్రేణుల్లో ఉత్సాహం నింపిన కందుకూరి స్వర్ణ ప్రసంగం**

**కూటమి ప్రభుత్వ 'సూపర్ సిక్స్' సూపర్ అట్టర్ ఫ్లాప్: ఆకుల వెంకట రామారావు నవంబర్ 5న పోలింగ్.. ప్రజా పక్షపాతులకే పట్టం కట్టాలని పిలుపు**











**ఎటపాక, నవంబర్ 03 (ప్రజాజ్యోతి):**దశాబ్దాల పోరాటాల చరిత్ర కలిగిన సీపీఐ కంచుకోట కృష్ణవరం ఎంపీటీసీ పరిధిలో ఎన్నికల ప్రచారం పతాక స్థాయికి చేరింది. ప్రచార చివరి రోజున వరుణుడు అడ్డంకిగా మారినా.. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సీపీఐ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదంతొక్కాయి. సీపీఎం, కాంగ్రెస్ పార్టీల సంపూర్ణ మద్దతుతో బరిలో నిలిచిన కృష్ణవరం ఎంపీటీసీ సీపీఐ అభ్యర్థి సున్నం పున్నమ్మ, జెడ్పీటీసీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాకా కామేశ్వరి తరపున నిర్వహించిన ఉమ్మడి భారీ ప్రచార ర్యాలీ నియోజక వర్గంలోనే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అచ్యుతపురం (కొత్తూరు) నుంచి గన్నవరం వరకు సాగిన ఈ ర్యాలీలో దారిపొడవునా ఇరు పార్టీల జెండాలు రెపరెపలాడాయి.

**వర్షంలోనూ తగ్గని ఉత్సాహం.. అచ్యుతాపురం నుంచి గన్నవరం వరకు ఎర్రమయం!**

ఆకాశం నుంచి జోరు వాన కురుస్తున్నప్పటికీ ప్రచార జోరు ఏమాత్రం తగ్గలేదు. మహిళలు, యువత, వృద్ధులు సైతం తడుస్తూనే అభ్యర్థులకు మద్దతుగా గొంతుకలిపి నినాదాలు చేశారు. దారిపొడవునా జనం బారులు తీరి మద్దతు పలకడంతో ముగింపు ర్యాలీ కాస్తా ముందస్తు విజయోత్సవ ర్యాలీని తలపించింది. ఎర్రదండు ఐక్యంగా కదం తొక్కడంతో పల్లెపల్లెనా రాజకీయ సందడి తారాస్థాయికి చేరింది.

**ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ ధ్యేయం: కందుకూరి స్వర్ణ**

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కందుకూరి స్వర్ణ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల హక్కుల సాధన కోసం జీవితాంతం పరితపించిన దివంగత నేత కందుకూరి మంగరాజు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలన్నారు. రైతులు, కూలీలు, పేదల పక్షాన నిరంతరం పోరాడే ఏకైక శక్తి ఎర్రజెండానే అని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎంపీటీసీ సీపీఐ అభ్యర్థి సున్నం పున్నమ్మను కంకి కొడవలి గుర్తుపై, జెడ్పీటీసీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాకా కామేశ్వరిని ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం: ఆకుల వెంకట రామారావు**

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఆకుల వెంకట రామారావు (పెద్దోడు) మాట్లాడుతూ, ఎన్నికల ముందు రంగురంగుల హామీలు గుప్పించి గద్దెనెక్కిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అటకెక్కించిందని మండిపడ్డారు. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అమలైన ప్రజాహిత పథకాలన్నింటినీ తుంగలో తొక్కారని విమర్శించారు. నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.1,500 సాయం, పింఛన్లు, రేషన్ తదితర 'సూపర్ సిక్స్' హామీలన్నీ సూపర్ అట్టర్ ఫ్లాప్‌గా మిగిలాయని ధ్వజమెత్తారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని కూటమి ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని, ప్రజా గొంతుకలను గెలిపించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు.

**నవంబర్ 5న విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి**

ఈ నెల 5వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనున్న నేపథ్యంలో, ఓటర్లంతా చైతన్యంతో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని నేతలు విజ్ఞప్తి చేశారు. స్థానిక సమస్యల పరిష్కారం, గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా నిలిచిన అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎలిసాల నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి ఆకుల దయాకర్, సీపీఐ సీనియర్ నాయకులు వల్లభనేని సత్యనారాయణ, వైఎస్ఆర్‌సిపి ఎస్టీ సెల్ కార్యదర్శి చిచ్చడీ రామారావు, కృష్ణవరం మాజీ సర్పంచ్ కురసం కృష్ణ, పసుపులేటి లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నేతలు చింటూ, కురినాల వెంకటేశ్వర్లు (బుజ్జి)తో పాటు సీపీఐ, వైఎస్సార్‌సీపీ, సీపీఎం, కాంగ్రెస్ శ్రేణులు, మహిళలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# గొల్లప్రోలు గడ్డపై జనసేన భగీరథ విజయం.. 8,437 ఓట్ల రికార్డు

## మెజారిటీతో చైర్‌పర్సన్ పీఠాన్ని అధిరోహించిన కడారి తమ్మయ్య నాయుడు!

**కూటమి సునామీకి కొట్టుకుపోయిన విపక్షాలు కనీసం ఖాతా తెరవలేక వైఎస్సార్‌సీపీ ఘోర పరాజయం!**

**గొల్లప్రోలు ప్రజా జ్యోతి** రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమే కావచ్చు, కానీ కొన్ని విజయాలు చరిత్రను తిరగరాస్తాయి, తరతరాల పాటు నిలిచిపోయే సరికొత్త రికార్డులను సృష్టిస్తాయి! సరిగ్గా అలాంటి ఒక అఖండ, ఏకపక్ష, చారిత్రాత్మక విజయంతో గొల్లప్రోలు మున్సిపల్ ఎన్నికల చరిత్రలోనే జనసేన పార్టీ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. "మేము వస్తే చరిత్ర మారాలి.. మా గెలుపు చూస్తే ప్రత్యర్థుల గుండెల్లో వణుకు పుట్టాలి" అన్న చందంగా... వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చెక్కపల్లి నాగేశ్వరరావు (దివాణం)పై జనసేన పార్టీ అభ్యర్థి కడారి తమ్మయ్య నాయుడు 8,437 ఓట్ల ఊహించని భారీ, రికార్డు మెజారిటీతో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా సింహాసనాన్ని అధిష్టించారు. ఈ ఏకపక్ష వన్-సైడ్ వార్‌తో గొల్లప్రోలు మున్సిపల్ పీఠంపై జనసేన జెండా రెపరెపలాడింది!

**విపక్షాలకు అందనంత ఎత్తులో తమ్మయ్య నాయుడు వన్‌సైడ్ వార్!**

ఓట్ల లెక్కింపు ప్రారంభమైన మొదటి రౌండ్ నుంచే జనసేన అభ్యర్థి కడారి తమ్మయ్య నాయుడు తన ప్రత్యర్థులకు కనీసం పోటీ ఇచ్చే అవకాశం కూడా ఇవ్వకుండా, సింహస్వప్నమై దూసుకుపోయారు. "ప్రత్యర్థి ఎవరో చూసుకో.. ప్రవాహం లాంటి మా మెజారిటీని ఆపుకో" అన్న రేంజ్‌లో రౌండ్ రౌండ్‌కూ ఆధిక్యం పెరుగుతుంటే విపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. ఓటర్లు జనసేన వైపు ఏకపక్షంగా మొగ్గు చూపిన తీరు రాజకీయ విశ్లేషకులను సైతం విస్మయానికి గురిచేసింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంటే దాదాపు నాలుగింతలు ఎక్కువ ఓట్లు సాధించి, 8,437 ఓట్ల అద్భుత ఆధిక్యతతో తమ్మయ్య నాయుడు సాధించిన ఈ గెలుపు గొల్లప్రోలు రాజకీయాల్లో ఒక తిరుగులేని మైలురాయిగా నిలిచిపోనుంది!

**తుది ఫలితాల సరళి మరియు ఓట్ల వివరాలు**

కడారి తమ్మయ్య నాయుడు జనసేన 11,757 ఓట్లు విజయభేరి

చెక్కపల్లి నాగేశ్వరరావు వైఎస్సార్‌సీపీ : 3,320 ఓట్లు

కృష్ణా వెంకటేశ్వరరావు ఇండిపెండెంట్ : 282 ఓట్లు

గారపాటి సుబ్బారావు కాంగ్రెస్ : 66 ఓట్లు

నోటా 129 ఓట్లు చెల్లని ఓట్లు: 472

**కూటమి క్లీన్ స్వీప్.. సున్నాకే పరిమితమైన ప్రతిపక్షం!**

మొత్తం 23 వార్డులున్న గొల్లప్రోలు మున్సిపాలిటీలో కూటమి అభ్యర్థుల హవాకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. జనసేన ఒంటరిగానే 13 వార్డులను కైవసం చేసుకోగా, మిత్రపక్షం టీడీపీ 6 వార్డుల్లో జయకేతనం ఎగరేసి క్లీన్ స్వీప్‌లో భుజం భుజం కలిపింది. ప్రధాన ప్రతిపక్షం అని చెప్పుకునే వైఎస్సార్‌సీపీ కనీసం ఒక్కటంటే ఒక్క వార్డులోనూ ఖాతా తెరవలేక ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.

**పార్టీల వారీగా గెలిచిన వార్డుల వివరాలు**

జనసేన 13 వార్డులు 1, 2, 3, 4, 8, 11, 12, 14, 15, 16, 18, 19, 20 వార్డుల్లో ప్రభంజనం.తెలుగుదేశం 6



వార్డులు 5, 6, 9, 21, 22, 23 వార్డుల్లో ఘనవిజయం.

**ఇండిపెండెంట్లు 4 వార్డులు : 7, 10, 13, 17 వార్డులు.**

కడారి తమ్మయ్య నాయుడు సాధించిన ఈ చారిత్రాత్మక, తిరుగులేని విజయంతో గొల్లప్రోలు పట్టణం అంతా పండుగ వాతావరణం నెలకొంది. ఫలితం తేలడమే ఆలస్యం.. జనసేన, టీడీపీ శ్రేణులు, నాయకులు, విపరీతమైన సంఖ్యలో తరలివచ్చిన వీరాభిమానులు రోడ్లపైకి వచ్చి బాణాసంచా కాలుస్తూ, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. "పవన్ కళ్యాణ్ గాలి వీస్తే ఎలా ఉంటుందో చూపించాం.. ఈ గొల్లప్రోలు గడ్డ ఎప్పటికీ జనసేన అడ్డానే!" అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలతో పురవీధులు మారుమోగిపోయాయి.

## కూటమితోనే అభివృద్ధి సాధ్యం

**మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ దేశాయ్ మాధవరావు**



**నందవరం, నవంబరు 03 (ప్రజా జ్యోతి ):** స్థానిక సంస్థల ఎన్ని కల్లో కూటమి అభ్యర్థులకు ఓటేసి అభివృద్ధికి బాటలు వేయాలని మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ దేశాయి మాధవరావు ఓటర్లను కోరారు. నందవరం జడ్పీటీసీ అభ్యర్థి అక్కామాంబాదేవి, నంద వరం ఎంపీటీసీ-2 అభ్యర్థి చెంచు నాగలక్ష్మి గెలుపు కోసం ఆయన నందవరంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కూలీలు ఆటోలో పొలం పనులకు వెళ్తుండగా ఆపి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభి వృద్ధి పనులను వివరించారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే గ్రామా లను మరింత అభివృద్ధి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ టీసీ తిమ్మరాజు, సహకార సంఘం మండల ఆధ్యక్షుడు ధర్మాపురం గోపాల్, రాజోళి మోహన్, చెంచు బంగారి, వడ్డే గోపాల్, వడ్డె మురళి, వడ్డేరవి, లింగన్న, దందునాగరాజు, శివరామ్ పాల్గొన్నారు.

## సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించండి

**---టిడిపి ఎంపిటిసి అభ్యర్తులు నాగ రత్నమ్మ. మాసపోగు ఈరన్న.**



**నందవరం, నవంబర్ 03(ప్రజా జ్యోతి):** ఎంపిటిసి గా గెలిపించండి గ్రామ అభివృద్ధి చేస్తామని తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ-2 అభ్యర్థి ముగతి మాసపోగు ఈరన్న, ఎంపిటిసి - 1 నాగరత్నమ్మ లు అన్నారు. ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈరన్న గౌడ్, భార్గవ్ యాదవ్ సమక్షంలో ముగతి గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థులు టిడిపి నాయకులతో కలసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకొని సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు సూపర్ గా అందుతున్నాయని ఎంపీటీసీ లుగా గెలిపిస్తే ఎమ్మెల్యే బివి సహకారంతో గ్రామాభివృద్ధి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూటమితోనే అభివృద్ధి సాధ్యం- సీనియర్టీడీపీ నాయకులు రఘుమూర్తి స్వామి



**నందవరం, నవంబరు 03 (ప్రజా జ్యోతి ):** స్థానిక సంస్థల ఎన్ని కల్లో కూటమి అభ్యర్థులకు ఓటేసి అభివృద్ధికి బాటలు వేయాలని కనకవీడు టిడిపి సీనియర్ నాయకులు రఘు మూర్తి స్వామి ఓటర్లను కోరారు. జడ్పీటీసీ అభ్యర్థి అక్కామాంబాదేవి,ఎంపీటీసీ అభ్యర్థి గీతా భాయ్, ఎంపీటీసీ అభ్యర్థి లలితమ్మ లు గెలుపు కోసం వారు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే గ్రామా లను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భీమన్న, రాజు డి హుస్సేన్ టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దళితవాడలో వికసించిన కమలం



**గుంతకల్లు నవంబర్ 3 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు మున్సిపల్ ఎన్నికలలో పట్టణంలోని నాలుగవ వార్డు దళితవాడలో (బిజెపి) కమలం వికసించింది. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు మోండ్ల కేశవ తల్లి మోండ్ల మహాలక్ష్మి 14 ఓట్లతో విజయం సాధించి గుంతకల్లు పట్టణంలో ఓకే వార్డు అది కూడా దళితవార్డులో గెలవడంతో బిజెపి నాయకులలో సంతోషం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు.



# నందికొట్కూరు మున్సిపాలిటీలో వైఎస్సార్సీపీ విజయకేతనం

**ఛైర్‌పర్సన్‌గా షేక్ ఫాతిమాబీ ఘన విజయం**

**23 వార్డుల్లో వైఎస్సార్సీపీ, 9 వార్డుల్లో టీడీపీ గెలుపు**

**ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా: షేక్ ఫాతిమాబీ**



**ప్రజా జ్యోతి నందికొట్కూరు** నందికొట్కూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి మున్సిపాలిటీపై తన ఆధిపత్యాన్ని చాటుకుంది. మొత్తం 32 వార్డులకు జరిగిన ఎన్నికల్లో 23 వార్డులను వైఎస్సార్సీపీ కైవసం చేసుకోగా, 9 వార్డుల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థి షేక్ ఫాతిమాబీ 2,634 ఓట్ల భారీ ఆధిక్యంతో ఘన విజయం సాధించి ఛైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించుకున్నారు.ఈ ఎన్నికల ఫలితాలు నందికొట్కూరు పట్టణ రాజకీయాల్లో వైఎస్సార్సీపీకి ప్రజల్లో ఉన్న ఆదరణను చాటిచెప్పాయి. పార్టీ అభ్యర్థులు అత్యధిక వార్డుల్లో విజయం సాధించడంతో వైఎస్సార్సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. విజయం అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో సంబరాలు నిర్వహించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ నందికొట్కూరు పట్టణ ప్రజలు వైఎస్సార్సీపీపై విశ్వాసం ఉంచి ఘన విజయాన్ని అందించారని పేర్కొన్నారు. 32 వార్డులకు గాను 23 వార్డుల్లో పార్టీ అభ్యర్థులు విజయం సాధించడం ప్రజల మద్దతుకు నిదర్శనమన్నారు. ఈ విజయం కోసం కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. ప్రజల ఆశీర్వాదం, కార్యకర్తల సమష్టి కృషి పార్టీ విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఛైర్‌పర్సన్‌గా విజయం సాధించిన షేక్ ఫాతిమాబీ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి భారీ మెజారిటీతో గెలిపించిన నందికొట్కూరు పట్టణ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తానని, వారి నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము చేయనని స్పష్టం చేశారు. నందికొట్కూరు పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. పట్టణంలో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని,



రాజకీయాలకు అతీతంగా పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని పేర్కొన్నారు. తన విజయానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నందికొట్కూరు పట్టణ ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని అభివృద్ధి పనుల ద్వారా నిలబెట్టుకుంటానని షేక్ ఫాతిమాబీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# సదరం స్లాట్ బుకింగ్ పేరుతో దివ్యాంగులకు అవమానాలు.. గుంతకల్ సచివాలయాల తీరుపై తీవ్ర ఆగ్రహం:పద్మా

**దివ్యాంగులంటే అధికారులకు అంత చులకనా?**

**గంటల తరబడి క్యూలో నిలబెట్టి.. చివరికి మీ సేవకు పొమ్మంటారా?**

**జిల్లా అధికారులు సాధారం సర్వేర్ ఎక్కువ సమయం ఇవ్వలేదు అని మీ సేవలో పోయి చెపించుకోండి అని దివ్యాంగులకు సచివాలయం సిబ్బంది తెలియజేస్తున్నారు**

**పద్మ, దివ్యాంగుల హక్కుల పోరాట సాధన సమితి అధ్యక్షురాలు**



**గుంతకల్లు నవంబర్ 3 (ప్రజా జ్యోతి):** దివ్యాంగులకు సేవలు అందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలే వారికి ఇబ్బందులు కలిగిస్తే ఇక న్యాయం కోసం ఎవరిని ఆశ్రయించాలి? దివ్యాంగుల పట్ల అధికారుల నిర్లక్ష్య వైఖరికి ఇంకెప్పుడు ముగింపు పలుకుతారు అంటూ దివ్యాంగుల హక్కుల పోరాట సాధన సమితి అధ్యక్షురాలు పద్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సదరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు నవంబర్ 2, 2026 ఉదయం 10:30 గంటల నుంచి స్లాట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగులు స్లాట్ బుకింగ్ కోసం సచివాలయాల వద్దకు చేరుకున్నారు. అయితే గుంతకల్లు పట్టణం లోని కొన్ని సచివాలయాల్లో గంటల తరబడి క్యూలలో నిరీక్షించిన తర్వాత ఇక్కడ స్లాట్ బుకింగ్ చేయడం సాధ్యం కాదని, మీ సేవ కేంద్రాలకు వెళ్లి బుకింగ్ చేయించుకోవాలని సిబ్బంది చెప్పడం దారుణమని పద్మ మండిపడ్డారు. అసలు ప్రశ్న ఏమిటంటే.. స్లాట్ బుకింగ్ చేయలేనప్పుడు దివ్యాంగు లను సచివాలయాలకు ఎందుకు రప్పించారు? ముందుగానే సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులకు లేదా? ఇప్పటికే శారీరక ఇబ్బందు లతో జీవనం సాగిస్తున్న దివ్యాంగులను గంటల తరబడి క్యూలలో నిలబెట్టడం ఎంతవరకు మానవత్వం కనీసం తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించలేని పరిస్థితి ఎందుకు? వీల్‌చైర్లపై వచ్చే వారు, వృద్ధ దివ్యాంగులు పడుతున్న ఇబ్బందులు అధికారులకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రకటిస్తుంటే క్షేత్రస్థాయిలో కొందరు అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగులను ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి తిప్పుతూ వారి సమయాన్ని, శ్రమను వృథా చేయడం తగదన్నారు.

**మా ప్రధాన డిమాండ్లు**

గుంతకల్‌లో సదరం స్లాట్ బుకింగ్ ప్రక్రియపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణ విచారణ చేపట్టాలి సదరం సర్వేర్ ఎక్కువ సమయం కేటాయించాలి స్లాట్ ఎక్కువ కేటాయించాలి ప్రతి సచివాలయాల్లోనూ ఎన్ని అప్లై చేశారు ? స్లాట్ బుకింగ్ ఎక్కడ, ఎలా చేసుకోవాలో స్పష్టమైన సమాచారాన్ని సచివాలయాల వద్ద ప్రదర్శించాలి. దివ్యాం గులకు ప్రత్యేక ప్రాధాన్య తతో స్లాట్ బుకింగ్ సదుపాయం కల్పించాలి. కూర్చోవడానికి కుర్చీలు, తాగునీరు, వీల్‌చైర్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. దివ్యాంగులను ఇబ్బందులకు గురిచేసినట్లు నిర్ధారణ అయితే బాధ్యు లైన సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలి. దివ్యాంగుల సహనాన్ని చేతగానితనంగా భావించ వద్దు. వారి హక్కులను కాలరాయడానికి ఎవరికీ అధికారం లేదు. సదరం సర్టిఫికెట్ కోసం వచ్చే దివ్యాంగులకు అవమానా లు కాదు.. గౌరవం, సహకారం, సకాలంలో సేవలు అందించాలి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖ ఉన్నతా ధికారులు స్పందించి దివ్యాంగులకు న్యాయం చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సాధన సమితి అధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు.

# డోన్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకున్న టిడిపి





**డోన్ ప్రజా జ్యోతి నవంబర్ 3,** నంద్యాల జిల్లాడోన్ డోను పట్టణం మంగళవారం గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నందు మున్సిపాలిటీ ఎలక్షన్ల ఓటర్ల కౌంటింగ్ సందర్భంగా, మున్సిపల్ పీఠాన్ని తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. మున్సిపల్ చైర్మన్ స్థానానికి హోరాహోరీగా సాగిన ఎన్నికల సమరంలో టీడీపీ అభ్యర్థి కోట్ల సుజాతమ్మ తన సమీప వైసీపీ అభ్యర్థి బోయ చైతన్యపై 375 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. మొత్తం 4 రౌండ్ల పాటు సాగిన ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ప్రతి రౌండూ అత్యంత ఉత్కంఠ భరితంగా సాగింది. పీఠం ఎవరిదనే ఉత్కంఠ చివరి నిమిషం వరకు కొనసాగింది. నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లతో అధికారులులెక్కింపు ప్రక్రియను విజయవంతంగా పర్యవేక్షించారు.ఈ ఎన్నికల్లో మొత్తం 35,304 ఓట్లు పోలవగా, టీడీపీ అభ్యర్థి కోట్ల సుజాతమ్మకు 17,030 ఓట్లు, వైసీపీ అభ్యర్థి బోయ చైతన్యకు 16,696 ఓట్లు వచ్చాయి. ఈవీఎం ఓట్ల లెక్కింపు ముగిసేసరికి టీడీపీకి 334 ఓట్ల లీడ్ లభించగా, పోస్టల్ బ్యాలెట్లలోనూ మరో 41 ఓట్ల ఆధిక్యం దక్కింది. దీంతో మొత్తం 375 ఓట్ల మెజారిటీతో కోట్ల సుజాతమ్మ డోన్ మున్సిపాలిటీ చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది బరిలో ఉన్న స్వతంత్ర అభ్యర్థికి 232 ఓట్లు రాగా, నోటా కు 212 ఓట్లు పడ్డాయి. 1,134 ఓట్లు చెల్లనివిగా (ఇన్వాలిడ్) అధికారులు ప్రకటించారు. చైర్మన్ పీఠాన్ని టీడీపీ గెలుచుకున్నప్పటికీ, మున్సిపాలిటీలోని మొత్తం 36 వార్డుల కౌన్సిలర్ స్థానాల్లో బలాబలాలు అత్యంత రసవత్తరంగా మారాయి. ఏ ఒక్క పార్టీకి ఒంటరిగా దక్కించుకునే స్పష్టమైన మెజారిటీ రాలేదు. వార్డుల వారీగా ఫలితాలు వైసీపీ : 16 వార్డులు, టీడీపీ : 15 వార్డులు, జనసేన : 02 వార్డులు, సీపీఐ : 02 వార్డులు, స్వతంత్ర అభ్యర్థి : 01 వార్డు కౌన్సిలర్ స్థానాల్లో వైసీపీ 16 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించగా, టీడీపీ 15 స్థానాల్లో నిలిచింది. దీంతో మున్సిపల్ బోర్డులో జనసేన, సీపీఐ, స్వతంత్ర అభ్యర్థుల మద్దతు ఇప్పుడు అత్యంత కీలకంగా మారనుంది. మున్సిపాలిటీ చైర్మన్ కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ డోన్ అభివృద్ధికి కట్టుబడి ఉంటా,తనపై నమ్మకంతో, అపారమైన అభిమానాన్ని చూపిస్తూ గెలిపించిన డోన్ నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎలక్షన్ల ముందు నేను ఏవైతే చెప్పాను మంచిది సౌకర్యం సిసి రోడ్లు డ్రైనేజీ కాలువలు టౌన్ లో ప్రతి వార్డు నందు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారని తెలిపారు, స్థానికంగా ఉన్న ప్రతి చిన్న సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.కోట్ల సుజాతమ్మ గెలుపు సమాచారం తెలియగానే డోన్ పట్టణంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు కూటమి నాయకులు, బాను టపాసులు పేలుస్తూ ఆనందంతో, సంబరాల్లో మునిగిపోయారు.

# రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేసి వైసిపి అభ్యర్థులను గెలిపించండి

## వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి

## :-ప్రజల ఆశీస్సులతో గెలుస్తాం .... వైసిపి ఎంపిటిసి అభ్యర్థి గురునాథ్ రెడ్డి

## :- జగన్ పాలనలో చేసిన అభివృద్ధిని గుర్తు చేసుకోని ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి..దేశాయ్ ప్రహల్లాద ఆచారి

## :-బాపురం గ్రామంలో మంగళవారం రోజున వైసిపి ఎంపీటీసీ, జడ్పిటిసి ప్రచార కార్యక్రమం....











**కౌతాళం,నవంబర్ 03 ప్రజా జ్యోతి** కౌతాళం మండల పరిధిలోనే బాపురం గ్రామంలో మంగళవారం రోజున వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి పర్యటించారు.ఈ సందర్భంగా వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ ఎంపిటిసి అభ్యర్థి గురునాథ్ రెడ్డి కు,జడ్పిటిసి అభ్యర్థి కురువ లింగన్నకు వీరిద్దరికీ ఒక్కొక్కటి చెప్పనా రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వెయ్యాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహాయ, సహకారంతో మండలాన్ని ఎంతో అభివృద్ధి చేశారని వివరించారు.రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో ఘనవిజయం సాధిస్తామని తెలిపారు. ఎంపిటిసి, జెడ్పిటిసి అభ్యర్థిలగా ఫ్యాన్ గుర్తు పై, మీ అమూల్యమైన ఓటు వెయ్యాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**ఎంపిటిసి అభ్యర్థి గురునాథ్ రెడ్డి :**
బాపురం గ్రామంలో ఎంపిటిసిగా గెలిచి తీరుతామని ఎంపిటిసి అభ్యర్థి గురునాథ్ రెడ్డి తెలిపారు.ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి,ప్రదీప్ రెడ్డి ఆశీస్సులతో గెలిచి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. మీ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుకు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాదాచారి వైసీపీ సీనియర్ నాయకులు తోవి నర్సప్ప, ఆర్.ఎం సుధాకర్ రెడ్డి అయ్యప్ప రెడ్డి, దేవరెడ్డి,ఫర్టిలైజర్ రాఘవరెడ్డి,కుబేర్ రెడ్డి, నరసింహారెడ్డి, నాగభూషణ్ గౌడ, సుదర్శన్ రెడ్డి, నరసరెడ్డి, వీరల దీన్నే దివాకర్ రెడ్డి, శిల్పారెడ్డి, మాజీ ఎంపిటిసి సౌభాగ్య జైపాల్, నాగప్ప, మల్లేశ్వరరావు, ఏకాంబర రెడ్డి,బుజ్జి స్వామి పాల్ దినకర్,వడ్డే రాముడు,పిఏ వెంకట్రామిరెడ్డి, ముకన్నా, కుమార్ గౌడ,రాగప్ప, మరియు వైసిపి శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల సేవలు వినియోగించుకోవాలి

### పిల్లలకు పోషకాహారం ఇవ్వాలి

### రోజూ అంగన్వాడీ కేంద్రాలకు పంపాలి

### జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల** అంగన్వాడీ కేంద్రాల సేవలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు రుద్రంగి మండలం మానాల అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం 10 నిమిషాల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా అంగన్వాడి కేంద్రంలో పిల్లల ఎత్తు బరువును పరిశీలిస్తుండగా తనిఖీ చేశారు. సామ్, మామ్ పిల్లలపై ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రంలో ఆరో వాటర్ యంత్రం పనితీరు, ఫ్యాన్లు, లైట్లు పరిశీలించారు. అలాగే ప్రాథమిక పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనం సిద్ధం చేస్తుండగా, తనిఖీ చేశారు. తరగతి గదులు సైతం పరిశీలించారు.ఈ సందర్భంగా పోషణ మాసం ప్రాముఖ్యతను గర్భిణులు బాలింతలు పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. పిల్లలకు అన్నప్రాసన చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం 10 నిమిషాలు కార్యక్రమాన్ని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రాల సేవలు, వసతులు మెరుగు పరచడం, పోషకాహారం పంపిణీ, బాలల హక్కుల రక్షణ, వసతుల పెంపు తదితర అంశాలపై స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొనాలని



సూచించారు. ప్రతి రోజూ తల్లిదండ్రులు బాధ్యతగా ఆరేళ్ల లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా తీసుకెళ్లాలని వారి ఎత్తు, బరువు నమోదు చేయించాలని దానికి అనుగుణంగా పోషకాహారం అందించాలని సూచించారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఇప్పటి నుంచే సరైన పోషకాహారం అందించాలని, దీంతో వారి బంగారు భవితకు బాటలు పడతాయని స్పష్టం చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 10 వ తేదీ వరకు అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని, ఆరోగ్య కార్డులో నమోదు చేయాలని ఆదేశించారు. నీటిని వేడి చేసి.. చల్లార్చి తాగించాలని తెలిపారు. టాయిలెట్ వెళ్లిన తరువాత పిల్లలు చేతులు శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. బాలామృతంతో పిల్లలకు ఇష్టమైన కేకులు, లడ్డూలు, బిస్కెట్లు ఇతర ఆహార పదార్థాలు తయారు చేసి ఇవ్వాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు నిత్యం పంపించడంతో పిల్లలకు పోషకాహారం అందుతుందని, ఆట, పాటలు బొమ్మల ద్వారా విద్య బుద్దులు చెపుతారని వివరించారు. బాలల మొదటి వెయ్యి రోజుల దశ కీలకమని, వారికి సరైన పోషకాహారం ఇంట్లో సైతం ఇవ్వాలని సూచించారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించి.. మహిళలు, గర్భిణులకు వైద్య పరీక్షలు చేయాలని, మందులు అందించాలని ఆదేశించారు. గర్భిణులు నార్మల్ డెలివరీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా ప్రణాళిక శాఖ అధికారి సంపత్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలాల్ఫ్రెడ్, తహసీల్దార్ పుష్పలత, సర్పంచ్ శంకర్ తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఇష్టారాజ్యం?

### కరీంనగర్ కలెక్టర్ ఛాంబర్ ఎదుట బాధిత దంపతుల బైఠాయింపు

### అర్హులకు అన్యాయం.. అనర్హులకు అందలం

### గ్రామ కమిటీ ఆగడాలపై ఆగ్రహం

**కరీంనగర్ :** పేదల సొంతింటి కలను నిజం చేయాల్సిన ఇందిరమ్మ ఇళ్ల పథకం క్షేత్రస్థాయిలో వివాదాలకు కేంద్రంగా మారుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అర్హులైన నిరుపేదలకు ఇళ్లు మంజూరు కాకపోగా, ఆర్థిక స్థోమత, భూములు ఉన్నవారికి ఇళ్లను కేటాయిస్తున్నారనే విమర్శలు ప్రభుత్వ పథకం అమలులో పారదర్శకతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. గ్రామస్థాయి ఇందిరమ్మ కమిటీల నిర్ణయాలు పేదల పాలిట శాపంగా మారుతున్నాయంటూ బాధితులు ఆందోళనబాట పడుతుండగా, పేదల కోసం ప్రవేశపెట్టిన పథకంలో పేదలకే చోటు లేదా? అన్న ప్రశ్న ఇప్పుడు బాధితుల నుంచి వినిపిస్తోంది. ఇళ్ల కేటాయింపు తీరు గ్రామ కమిటీల సిఫార్సులు, పలుకుబడి, పైరవీలే ప్రామాణికంగా తీసుకుంటున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పథకం పేరుతో పేదలకు ఆశలు కల్పించి, చివరకు జాబితాల్లో మొండిచేయి చూపడమే ప్రభుత్వ పాలనలో పారదర్శకతకు నిదర్శనమా..? అని బాధితులు నిలదీస్తున్నారు. అయినా స్పందన లేకపోవటంతో, జిల్లా ఉన్నతాధికారి వద్దకే వచ్చి నిరసనలు చేపడుతున్నారు. ఇదే క్రమంలో సైదాపూర్ మండలం ఎలబోతారం గ్రామానికి చెందిన రావుల మమత, ఆమె భర్త అశోక్ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో తమకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ మంగళవారం కలెక్టర్ ఛాంబర్ ఎదుట బైఠాయించారు. గ్రామ కమిటీల ఏకపక్ష ధోరణి, అవినీతి, అక్రమాలు, ఇళ్ల కేటాయింపులో జరుగుతున్న అన్యాయంపై నినాదాలు చేస్తూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. తాము అత్యంత నిరుపేద కుటుంబానికి చెందినవారమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద దరఖాస్తు చేసుకున్నామని మమత తెలిపారు. మొదటి విడతలో ఇల్లు మంజూరైందని అధికారులు చెప్పగా, తమ పాత ఇంటిని సైతం తొలగించుకున్నామని, తీరా లబ్ధిదారుల జాబితాలో పేరు లేకుండా పోయిందని వాపోయారు. అప్పటి నుంచి నివాసం లేకుండా నిరాశ్రయులుగా కాలం వెళ్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా విడుదలైన రెండో విడత జాబితాలోనూ తమకు చోటు దక్కకపోవడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందన్నారు. మరోవైపు గ్రామంలో ఆర్థిక స్థోమత, భూములు ఉన్నవారికి ఇళ్లు కేటాయించారని, నిజమైన నిరుపేదలను మాత్రం పక్కన పెట్టారని ఆమె ఆరోపించారు. గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులను ఈ విషయమై ప్రశ్నించగా 'మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి' అంటూ అవమానకరంగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు.




తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తనకు వైద్య ఖర్చులు భరించే స్తోమత కూడా లేదని, తలదాచుకునేందుకు గూడు లేక కుటుంబం తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని కన్నీటిపర్యంత మయ్యారు. గ్రామ ఇందిరమ్మ కమిటీని రద్దు చేసి ప్రత్యేక అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని, గ్రామంలో మంజూరైన ఇళ్ల జాబితాను పునఃపరిశీలించి అనర్హుల ఎంపికపై చర్యలు తీసుకోవాలని మమత దంపతులు వీరి సమస్య తెలుసుకునేందుకు వచ్చిన కలెక్టరేట్ కార్య నిర్వహణాధికారిని వేసుకున్నారు. కాగా, బాధితుల దరఖాస్తు పరిశీలించిన ఏవో సుధాకర్ ఇల్లు మంజూరీకి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత మండల అధికారులకు సూచించారు.

## బడిలో మద్యం తాగుతూ పట్టుబడ్డ హెడ్‌మాస్టర్

**ఆసిఫాబాద్ :** తిర్యాణి మండలం గంభీరావుపేట ఎంపీయూపీఎస్ పాఠశాలలో హెడ్‌మాస్టర్ శ్రీనివాస్ మద్యం సేవించి స్కూలుకు వస్తున్నాడని విద్యార్థులు ఆరోపించారు. స్పందించిన గ్రామస్థులు, తల్లిదండ్రులు హెడ్‌మాస్టర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తరువాత స్కూల్ లో జరిగే తతంగం గురించి ఎంఈవోకు ఫిర్యాదు చేసారు.

## మియాపూర్ 550 ఎకరాల

## ప్రభుత్వ భూములను కాపాడాలి:

### వామపక్ష పార్టీల డిమాండ్

స్టాలిన్ నగర్, ముజఫర్ అహ్మద్ నగర్‌లలో సీపీఐ(ఎమ్), సీపీఐ(ఎమ్-ఎమ్) మరియు ఎంసీపీఐ(యు) నాయకుల విస్తృత పర్యటన.. మియాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 100 మరియు 101 లో ఉన్న 550 ఎకరాల అత్యంత ఖరీదైన భూమి పూర్తిగా ప్రభుత్వానిదేనని ఇటీవల దేశ అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) చారిత్రాత్మక తీర్పునిచ్చిన నేపథ్యంలో, ఈ భూములపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. భూ పరిధిలో ఉన్న పేదల నివాస ప్రాంతాలైన స్టాలిన్ నగర్, ముజఫర్ అహ్మద్ నగర్ ప్రజలను పరామర్శించేందుకు, అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకత్వం మరియు ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గం పర్యటించాయి.

## పట్టభద్రులారా.. ఓటు హక్కును నిర్లక్ష్యం చేయొద్దు

### ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అర్హులైన పట్టభద్రులు ప్రత్యేక దృష్టి సారించాలి

### ఓటు నమోదు చేసుకున్నప్పుడే ప్రశ్నించే హక్కుకు సార్థకత:

**కారేపల్లి,** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవాలని మండల మాజీ సీనియర్ జర్నలిస్టు అజ్మీరా వీరన్న పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు పట్ల విద్యావంతులు నిర్లక్ష్యం ప్రదర్శించడం ఆందోళనకరమన్నారు.మండల పరిధిలో డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ, ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవడంలో చాలామంది ఆసక్తి చూపడం లేదని పేర్కొన్నారు. పట్టభద్రుల సమస్యలను అర్థం చేసుకుని, వారి ఆకాంక్షలను శాసనమండలిలో బలంగా వినిపించే సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకునే అవకాశం విద్యావంతుల చేతుల్లోనే ఉందని స్పష్టం చేశారు.ఓటు హక్కును నమోదు చేసుకోకుండా ఎన్నికల సమయంలో నాయకులను ప్రశ్నించడం వల్ల ఆశించిన ప్రయోజనం ఉండదని, ప్రజాస్వామ్యంలో తమ భాగస్వామ్యాన్ని చాటుకోవాలంటే ముందుగా ఓటరుగా నమోదు కావడం ప్రతి పట్టభద్రుడి బాధ్యత అని అన్నారు. విద్యావంతులు రాజకీయ వ్యవస్థలో చురుకైన పాత్ర పోషించినప్పుడే ప్రజా సమస్యలపై అవగాహన కలిగిన సమర్థవంతమైన నాయకత్వం బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు.కావున మండలంలోని డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులు, ఇతర అర్హులైన పట్టభద్రులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని అజ్మీరా వీరన్న విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో పట్టభద్రుల గొంతుక బలంగా వినిపించాలంటే ప్రతి అర్హుడి ఓటు కీలకమని ఆయన పేర్కొన్నారు.

## ప్రజల ఇబ్బందుల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత

### భూపతిరాయుని చెరువు కట్టకు కొత్త రూపు.. పిచ్చిమొక్కల తొలగింపు

### సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ చొరవతో పారిశుద్ధ్య పనులు

**కారేపల్లి :** గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టడమే లక్ష్యంగా గాదెపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ ముందుకు సాగుతున్నారు. గ్రామ అభివృద్ధితో పాటు పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నారు.గాదెపాడు గ్రామపంచాయతీ పరిధిలోని భూపతిరాయుని చెరువు కట్టపై రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో అటుగా రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గ్రామస్తులు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేసి, చెరువు కట్టపై పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు.గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను గుర్తించిన వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.ప్రజల అవసరాలను గుర్తించి తక్షణమే స్పందిస్తూ చెరువు కట్టపై పిచ్చిమొక్కలు తొలగించడంపై గ్రామస్తులు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ చొరవను అభినందించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుమార్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆరు తడి పంటలు మాత్రమే వేయాలి

### జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్.

**కమాన్ పూర్ :** రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేయాలని పెద్దపెల్లి జిల్లా వ్యవసాయ అధికారి బి శ్రీనివాస్ అన్నారు. గుండారం గ్రామంలోని రైతు వేదికలో గిరి రామకృష్ణ ఆధ్వర్యంలో రైతులచే సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణలో ఎల్ ని నో ప్రభావం వల్ల వర్షాలు కురియక డ్యాములు నిండగా పోవడంతో సాగునీరుకు ఆటంకం ఏర్పడనున్నదాని అన్నారు. రబీ సీజన్ లో ప్రతి రైతు ఆడుతాది పంటలకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చి కంది పెసరు మక్కా వంటి విత్తనాలు వేయాలని కోరారు. అలాగే ఏపీఎంఏ అసోసియేషన్ ఆఫ్ ఫెస్టిసైడ్స్ మ్యానుఫ్యాక్చర్ తెలంగాణ ప్రతినిధి జి అశోక్ కుమార్ టాటా ర్యాలీస్ మాట్లాడుతూ పురుగుల మందుల పిచికారి సమయంలో రైతు సోదరులు పాటించవలసిన పద్ధతులను పురుగుమందుల తీవ్రతను తెలియజేసే గుర్తులపై అవగాహన కల్పించారు. అదే విధంగా వ్యవసాయ సంచాలకులు అంజలి మాట్లాడుతూ నేల సారాన్ని కాపాడుకోవాలని వరి కోసిన తర్వాత నిప్పు పెట్టకూడదని అన్నారు. ఈ సమావేశంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ జిల్లాలో రూ.1,778.51 కోట్ల వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణ

**నాగర్ కర్నూల్ :** నాగర్ కర్నూల్ జిల్లాలో రూ.1,778 కోట్లకు పైగా వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణకు చర్యలు జిల్లాలో కరువు ప్రభావిత మండలాల వారీగా పంట నష్టాల తీవ్రత గుర్తింపు గ్రామాల వారీగా రుణ పునర్వ్యవస్థీకరణకు అర్హులైన రైతుల గుర్తింపు అర్హులైన రైతులకు బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం జిల్లాలో కరువు పరిస్థితులపై బ్యాంకు అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.. తీవ్ర కరువు ప్రభావిత మండలాల్లో అర్హులైన రైతులకు 12 నెలల రుణ మారటోరియం తీవ్ర కరువు మండలాల్లో రుణ చెల్లింపు గడువు గరిష్ఠంగా 60 నెలలకు పొడిగింపు, పాక్షిక కరువు మండలాల్లో రుణ చెల్లింపు గడువు 36 నెలల వరకు పొడిగింపు వుంటుందని అన్నారు. . స్వల్పకాలిక పంట రుణాలను వడ్డీతో సహా మధ్యకాలిక రుణాలుగా మార్చే అవకాశం వుంటుందని అన్నారు. జిల్లాలో 65,893 మంది రైతులకు రూ.1,125.10 కోట్ల పంట రుణాల మంజూరు, మరో 27,297 మంది రైతులకు రూ.653.41 కోట్ల వ్యవసాయ కాలపరిమితి రుణాలు. అర్హులైన రైతులందరికీ రుణ పునర్వ్యవస్థీకరణ ప్రయోజనాలు అందించాలని కలెక్టర్ అన్నారు తదుపరి పంటల సాగుకు కొత్త పంట రుణాలు, వర్కింగ్ క్యాపిటల్ రుణాలు సకాలంలో మంజూరు చేయాలి. కరువు ప్రభావిత రైతులపై రుణ వసూళ్ల ఒత్తిడి, బెదిరింపులు చేయరాదు, రైతుల నుంచి బలవంతపు రుణ వసూళ్లు చేపట్టకూడదని బ్యాంకులకు కలెక్టర్ ఆదేశం ఇచ్చారు. రైతు వేదికలు, గ్రామసభల ద్వారా రుణ పునర్వ్యవస్థీకరణపై అవగాహన కల్పించాలి. వ్యవసాయ శాఖ, బ్యాంకులు సమన్వయంతో గ్రామాల వారీగా అర్హులైన రైతులను గుర్తించాలి. వచ్చే వారం రోజుల్లో మండల స్థాయిలో బ్యాంకుల సమన్వయ సమావేశాలు నిర్వహించాలిరుణ పునర్వ్యవస్థీకరణ అమలుపై పురోగతి నివేదికలు సమర్పించాలని అధికారులకు ఆదేశం ఇచ్చారు..

# చంటిబిడ్డను వదిలి. ప్రజల భద్రత కోసం క్షేత్రస్థాయిలో కమిషనర్

**తుఫాను వేళ తెల్లవారుజాము నుంచే సహాయక చర్యలు.**
**700 మందికి పునరావాసం, భోజన వసతి**




**బాపట్ల నవంబర్ 3 (ప్రజా జ్యోతిజిల్లా ప్రతినిధి)**మురసు తుఫాను ప్రభావంతో విపరీతమైన గాలులు, వర్షం కురుస్తున్నప్పటికీ ప్రజల భద్రతే ప్రధాన ధ్యేయంగా బాపట్ల పురపాలక సంఘం కమిషనర్ ఎం. హోసిని తెల్లవారుజాము నుంచే సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. ఇటీవలే బిడ్డకు జన్మనిచ్చి ప్రసవానంతర విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలోనూ, చంటిబిడ్డను ఇంటి వద్ద వదిలి విధి నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ క్షేత్రస్థాయిలో పర్యటించడం ప్రత్యేకంగా నిలిచింది. తుఫాను పరిస్థితుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులను సమన్వయం చేస్తూ సహాయక చర్యలను పర్యవేక్షించారు.జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ వి. వినోద్ కుమార్, ఐఏఎస్ ఆదేశాల మేరకు బాపట్ల పురపాలక సంఘం పరిధిలో ముందస్తు సహాయక, పునరావాస చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి, కర్లపాలెం రోడ్డులోని మాదాల నారాయణస్వామి కాలనీ, రాజీవ్ గాంధీ కాలనీ, ప్యాడిసినపేట కాలనీలకు చెందిన సుమారు 700 మందిని సురక్షితంగా తరలించారు.కమిషనర్ హోసిని స్వయంగా ప్రభావిత కాలనీలను సందర్శించి ప్రజల తరలింపు ప్రక్రియను పర్యవేక్షించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. వారిని స్వయంగా బస్సుల వద్దకు తీసుకువచ్చి, సురక్షితంగా బస్సుల్లో ఎక్కించి పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. తుఫాను గాలులు, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజలకు ధైర్యం చెబుతూ అవసరమైన సహాయ సహకారాలు అందించారు.పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న సుమారు 700 మందికి పురపాలక సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనంతో పాటు అవసరమైన ఆహార వసతులు కల్పించారు. ప్రజలకు తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తుఫాను పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని కమిషనర్ తెలిపారు. తుఫాను ప్రభావం పూర్తిగా తగ్గి సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు సహాయక, పునరావాస చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. విధి నిర్వహణలో వ్యక్తిగత పరిస్థితులను పక్కనపెట్టి ప్రజల భద్రత కోసం కమిషనర్ చూపిన చొరవ, అంకితభావం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## నాగభూషణం కళాశాలలో మహిళల ఎన్‌సీసీ ఆర్మీ ఎన్‌రోల్‌మెంట్ సెలెక్షన్స్



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 3 (ప్రజా జ్యోతి)** విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సేవా భావాన్ని పెంపొందించడంలో నేషనల్ క్యాడెట్ కోర్ ( ఎన్ సీ సీ) కీలక పాత్ర పోషిస్తుందని కళాశాల పరిపాలన అధికారి రాచపూడి వెంకట సాయి కృష్ణ తెలిపారు.బద్వేల్‌లోని శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ పీజీ (అటానమస్) కళాశాలలో గత కొన్ని దశాబ్దాలుగా విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా నేడు కళాశాల ప్రాంగణంలో ఆర్మీ ఎన్‌రోల్‌మెంట్ సెలెక్షన్స్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ ఎంపిక ప్రక్రియలో కళాశాల నుంచి 34 మంది విద్యార్థులు ఆర్మీ ఎన్‌రోల్‌మెంట్‌కు ఎంపికైనట్లు కళాశాల పరిపాలన అధికారి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ, ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో దేశ సేవ పట్ల ఆసక్తి, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగే లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫైవ్ ఆంధ్ర గర్ల్స్ ఎన్సిసి తిరుపతి కల్నల్ అంజు వాదవ, నాయక్ సుబేదార్ ప్రకాష్ కే, జీసీఐ అనంత భైరవి, కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ బాల ఓబులేసు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు, కళాశాల జూ రాధా పరమేశ్వరి, తదితరులు పాల్గొన్నారు. ఎన్సిసి బి పరీక్షలో ఉత్తీర్ణులైన క్యాడెట్స్ కి ఎన్సిసి బి సర్టిఫికెట్ ని అందించారు

## చౌళూరు పంచాయతీలో విస్తృత ఎన్నికల ప్రచారంలో చౌళూరు మధుమతి రెడ్డి



**హిందూపురం: ప్రజా జ్యోతి న్యూస్ నవంబర్ 03:** శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో అంజి: హిందూపురం మండలం చౌళూరు పంచాయతీ పరిధిలోని వెంకటాపురం కారుడపల్లి రామచంద్రపురం గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి రోడ్‌షో నిర్వహిస్తూ ప్రజలను కలుసుకుని పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఓట్లు అభ్యర్థించారు హిందూపురం రూరల్ మండల జెడ్పీటీసీ అభ్యర్థి పి సావిత్రమ్మ చౌళూరు ఎంపీటీసీ-1 అభ్యర్థి ఎస్ కీర్తి ఎంపీటీసీ-2 అభ్యర్థి ఎం హెచ్ మహాలక్ష్మి ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# జడ్పీ.టీ.సీఎన్నికల్లో అందరి చూపు వి.ఆర్.పురం,పైనే!..









**ఉత్కంఠగామారిన ఎన్నికలు!..**
**రాజకీయనాయకుల్లో ఆశక్తికర చర్చ!..**

**వరరామచంద్రాపురం, నవంబర్ 3 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** వరరామచంద్రాపురంలో, జడ్పీ.టి.సి, స్థానంలో త్రిముఖ పోటీ భలే రసవత్తరంగా మారింది. సమీకరణాలు, వ్యూహా ప్రతీ వ్యూహాలు, ఇలా?

**వాళ్ళ విష్ణుప్రియ, తెలుగుదేశం పార్టీ(కూటమి)!..**

అధికారంలో ఉన్నామనే బలంతో పాటు, ఓటమిలేని ఫ్యామిలీ, ఎప్పుడూ గెలుపేలక్ష్యంగా చరిత్ర కలిగిన కుటుంబం. ఆకుటుంబానికి మండలంలో అద్భుతమైన మద్దతు. లోతుగా అధ్యయనం చేస్తే విష్ణుప్రియ, తండ్రి వాళ్ళ రంగారెడ్డి, కి ఫ్యాన్ పాలోయింగ్ ఎక్కువ, పార్టీ కేడర్ భారీ స్థాయిలో ప్రచారం నిర్వహించినా బలమైన నాయకత్వం సదా మామూలే? కొందరు నాయకులు అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ప్రజలు గుసగుసలాడుతున్నారు. కూటమి ధర్మంపాటించనా నాయకులు సహాకారం ఆశించిన స్థాయిలో ఉందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏదిఏమైనా ప్రస్తుతం రేసులో దెబ్బా దెబ్బా,నువ్వానేనా అనే రేంజ్ లో ప్రచారంలో దూసుకుపోతున్నారు.క్రాస్ ఓటింగ్ ఉపయోగపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే వాళ్ళ విష్ణుప్రియ, ఈజీగా గెలిచే అవకాశాలు ఉన్నాయి.

**బంధం విజయలక్ష్మీ,వై.ఎస్.ఆర్,కాంగ్రెస్ పార్టీ!..**

పార్టీ కేడర్ బలం ఉన్నప్పటికీ పెద్దనాయకుల వ్యవహారం తల నొప్పిగా మారిందనే వాదనలు వినిపిస్తున్నాయి. గిరిజన గ్రామాల్లో కార్యకర్తలు బలం మెండుగా ఉన్నా? కొన్ని, కొన్ని లోపాలు భయం కలిగిస్తున్నాయి. చీకటి ఒప్పందాలు దెబ్బతీస్తాయనే ఆందోళన, ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. కార్యకర్తలు మాత్రం గెలుస్తామనే ధీమా వ్యక్తం చేయడం కొంత ఉత్సహాన్ని కలిగించినా నాయకులు మధ్య కొంత గ్యాప్ ఇబ్బంది కలిగిస్తుందా? లేక ధైర్యంగా ఎదుర్కొని నిలుస్తుందా వేచి చూడాలి.బంధం విజయ లక్ష్మీ, అనేపేరు ఎన్నికలకు కొత్తకాదు గత 20 ఏళ్లుగా ప్రజా సేవలో, అందరికీ బాగా తెలిచిన బంధం విజయలక్ష్మీ, మంచివ్యక్తిగా పేరు ప్రతిష్టలు, ఉన్నాయి. మంచి బలమైన గిరిజన కుటుంబం.మైనస్ లు లేవు. ఉమ్మడి వరం, గ్రామంతో పాటు ఏజెన్సీప్రాంతంలో మంచి బంధుత్వాలు ఉన్నాయి.ఆవిధంగా ఓటింగ్ బాగా సహాకరించే అవకాశాలు బాగా కలిసొచ్చే అంశమే?టౌన్ లో వై.ఎస్. ఆర్, కాంగ్రెస్ పార్టీకి ఓట్లు భారీగా నమోదైతే విజయం సాధించడం విజయ లక్ష్మీకి, పెద్దవిశేషం కాదు. శ్రీ రామగిరి, రాజుపేట, సీతంపేట, వడ్డిగూడెం, ధర్మాతాళ్లగూడెం, రేఖపల్లి, వరరామ చంద్రాపురం, గొల్లగూడెం, బి.సి, కాలనీలో మెజారిటీ సాధిస్తే విజయావకాశాలు ఉంటాయనేది విశ్లేషకులు వాదన? ఏజెన్సీ గ్రామాల్లో కి వెల్లిన కొద్ది ముగ్గురు ఓట్లు పంచుకుంటారు కాబట్టి మెజారిటీ సాధించి, విజయ కేతనంఎగురవేసే అవకాశాలు ఉన్నాయి.

**కారం సుజాత,సి.పి.ఎం,పార్టీ అభ్యర్థి!..**

జడ్పీ. టి.సి, అభ్యర్థిగా మంచి మనిషి, కల్మషంలేని అభ్యర్థి, విద్యా వంతురాలు, ఇవి 100%ఉన్న సుజాత, సి.పి.ఎం, పార్టీ, నుండి పోటీలో ఉన్నారు. కలిసొచ్చే అంశాలు, మంచి పోరాటం చేసే పార్టీ,ప్రజల వైపు నిలబడి నిలదీసే పార్టీ,ముందు తడబాటుపడ్డా ప్రస్తుతం గెలిచే రేసులో నిలిసారు. అనూహ్యంగా అధికార కూటమి పార్టీకి, వై.ఎస్. ఆర్, పార్టీ అభ్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తూ రేసులోకి వచ్చారు. ముక్కోణపు పోటీలో గెలిచినా ఆశ్చర్యం అవసరం లేదు. ఏంమాయ చేశారో కానీ ఊహించని రీతిలో విజయావకాశాలు తమవైపుకు తిప్పుకోవ డంలో సెక్స్‌స్ అయ్యారనే చెప్పాలి.కారం సుజాత, గెలిచి తీరు తుందని సి.పి.ఎం,పార్టీ వర్గాలు బల్లగుద్ది మరీ చెప్పుతున్నాయి.

## ఓటు వేసి ఆశీర్వదించండి...వైసీపీ యువ నాయకుడు ఇద్రుష్ బాష



**కౌతాళం, నవంబర్ 03 ప్రజా జ్యోతి** ప్రజల మద్దతే అండగా గెలుపే లక్ష్యంగా వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి శైనాజ్ కు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని ఇద్రుష్ బాష ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు.మంగళవారం మండల కేంద్రంలో పరిధిలోని 1,2,3,4,5, 6. వార్డ్ లో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలుస్తూ తనకు ఒక్క అవకాశం ఇచ్చి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు,మౌలిక సదుపాయాల అవసరాలు,ఇతర స్థానిక సమస్యలపై నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే మిత్రులు ఎంపీటీసీ 2.అవతారం ఎంపీటీసీ 3..రామకృష్ణ ఫ్యాన్ గుర్తు కు ఓటేసి అఖండ మెజారిటీ గెలిపించాలని గ్రామ ప్రజలను చేతులు ఎత్తి వారిని మొక్కి ప్రార్తించారు..

# వర్షాన్ని సైతం లెక్కచేయని ప్రచార జోరు..రేగులపాడు సెగ్మెంట్‌లో వైసీపీ

**--సీపీఎం పాదయాత్ర!**
**నిర్వాసితుల సమస్యల పరిష్కారం.. గ్రామాల అభివృద్ధే ప్రధాన అజెండాగా ఇంటింటి ప్రచారం**

**కూనవరం నవంబర్ 3, (ప్రజా జ్యోతి ప్రతినిధి కిరణ్ బాబు)రేగులపాడు:** వర్షం అడ్డంకిగా మారినా ఎన్నికల ప్రచారంలో వైసీపీ--సీపీఎం శ్రేణులు వెనకడుగు వేయలేదు. రేగులపాడు ఎంపీటీసీ సెగ్మెంట్ పరిధిలోని అఖిచర్ల, లింగాపురం, సీతారాంపురం, రేగులపాడు, కోడేరు, బొజ్జరాయిగూడెం, తాళ్లగూడెం గ్రామాల్లో వందలాది మంది కార్యకర్తలు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పాదయాత్ర నిర్వహిస్తూ ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేశారు.గ్రామాల్లో వీధివీధినా పర్యటిస్తూ పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం, స్థానిక ప్రజల హక్కుల పరిరక్షణ, గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రజలకు తమ అభ్యర్థుల గెలుపు ఆవశ్యకతను వివరించారు.ఈ సందర్భంగా రేగులపాడు ఎంపీటీసీ అభ్యర్థి గుండం బుచ్చమ్మ (సుత్తి--కొడవలి--నక్షత్రం గుర్తు), జడ్పీటీసీ అభ్యర్థి లిగుజ్జా బాబు (ఫ్యాన్ గుర్తు)లిలకు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.ఈ ప్రచార కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, నాసుపల్లి వెంకటేశ్వరరావు, వైసీపీ నాయకులు బొగ్గ చంద్రయ్య, జీవరత్నం, మాజీ సర్పంచులు బొగ్గ రామారావు, సోడే శంకర్, సోడే రాఘవయ్య, పండ గంగయ్య, తిమ్మసుబ్బయ్య, సోడా రామయ్య, గుండం బాబు, బొగ్గ సుబ్బయ్యతో పాటు వైసీపీ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గ్రామంలో సమస్యలకు పుల్ స్టాప్ పెడతాం.... టిడిపి నాయకుడు కోళ్ల శ్రీరామ్,ఎంపిటిసి అభ్యర్థి చిన్న తాయమ్మ



**కౌతాళం, నవంబర్ 03 ప్రజా జ్యోతి:** మండలంలోని ఎరిగేరి గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఎంపిటిసి అభ్యర్థిగా జి.చిన్న తాయమ్మ బరిలో నిలిచారు.ఇప్పటికే ఎన్నికల ప్రచారానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు టిడిపి నాయకులు కోళ్ల శ్రీరామ్,ఎంపిటిసి అభ్యర్థి జి.చిన్న తాయమ్మ తెలిపారు. ముఖ్యంగా మంత్రాలయం టిడిపి ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు ఉలిగయ్య,టిడిపి మండల అధ్యక్షులు సురేష్ నాయుడు, కౌతాళం సొసైటీ చైర్మన్ అల్లూరి వెంకటపతి రాజు,టిడిపి సీనియర్ నాయకులు రామలింగ, టిడిపి గ్రామ అధ్యక్షులు బసవరాజు మరియు తెలుగుదేశం కుటుంబ సభ్యులు సహాయ, సహకారులతో ముందుకు వెళుతున్నామని తెలిపారు.ఇప్పటికే గ్రామంలో ఉండే సమస్యల పై పూర్తిస్థాయిలో అవగాహన ఉందని తెలిపారు.గ్రామంలో సమస్యలకు పుల్ స్టాప్ పెడతామని తెలిపారు. ప్రచారాన్ని ముమ్మరంగా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ఎస్ఎంసి చైర్మన్ వడ్డే రామయ్య,మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, గిద్దయ్య,ఏసీ వీరేష్, అంజి,నగేష్ తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బిజినెస్

## దలాల్ స్ట్రీట్‌లో దూసుకెళ్లిన సూచీలు.. సెన్సెక్స్ 1,225 పాయింట్లు జంప్

**76,917.85 వద్ద ముగిసిన సెన్సెక్స్**

**నిఫ్టీ 370.05 పాయింట్లు పెరిగి 23,810.85కు చేరిక**

**వరుసగా నాలుగో సెషన్‌లోనూ మార్కెట్లకు లాభాలు**

**బ్రెంట్ క్రూడ్ ధర తగ్గడంతో ఇన్వెస్టర్లలో ఆశావాదం**

**ఎఫ్ఎంసీజీ, రియల్టీ, ప్రైవేట్ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లు**



దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గడం, విదేశీ పెట్టుబడులు తిరిగి రావడం, కంపెనీల త్రైమాసిక ఫలితాలు ఇన్వెస్టర్లలో ఆశలు పెంచడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 1,225.07 పాయింట్లు (1.62 శాతం) ఎగబాకి 76,917.85 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 370.05 పాయింట్లు (1.58 శాతం) పెరిగి 23,810.85 వద్ద ముగిసింది. దీంతో నిఫ్టీ కీలకమైన 23,800 పాయింట్ల స్థాయిని తిరిగి అధిగమించింది. వరుసగా నాలుగో సెషన్‌లోనూ మార్కెట్లు లాభాలు నమోదు చేశాయి. ఈ నాలుగు సెషన్లలో సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు 5 శాతం మేర పెరిగాయి. మార్కెట్ ర్యాలీకి ప్రధానంగా ముడిచమురు ధరల తగ్గుదల తోడైంది. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ధర గత సెషన్‌లో సుమారు 7 శాతం పడిపోయి బ్యారెల్‌కు 105 డాలర్ల స్థాయికి చేరింది. అమెరికా–ఇరాన్ మధ్య దౌత్య చర్చల్లో పురోగతి ఉండొచ్చన్న సంకేతాలతో సరఫరాకు ఆటంకాలు తగ్గుతాయనే అంచనాలు ఏర్పడ్డాయి. భారత్ తన చమురు అవసరాల్లో అధిక భాగాన్ని దిగుమతి చేసుకుంటుంది. అందువల్ల ముడిచమురు ధరలు తగ్గితే దేశ దిగుమతి బిల్లు, ద్రవ్యోల్బణ ఒత్తిడి తగ్గే అవకాశం ఉంటుంది. కంపెనీలకు ముడిసరుకు, ఇంధన వ్యయాలు తగ్గుతాయన్న ఆశలతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. మరోవైపు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారత ఈక్విటీ మార్కెట్లలో మళ్లీ కొనుగోళ్లు చేపట్టడం కూడా సూచీలకు బలాన్నిచ్చింది. రంగాలవారీగా చూస్తే ఎఫ్ఎంసీజీ షేర్లు అత్యధికంగా పుంజుకున్నాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ సూచీ 2.5 శాతం పెరిగింది. రియల్టీ సూచీ 2.2 శాతం, ప్రైవేట్ బ్యాంకుల సూచీ 1.78 శాతం లాభపడ్డాయి. బ్యాంకింగ్, ఆటో, మీడియా రంగాల షేర్లలోనూ కొనుగోళ్లు కనిపించాయి. నిఫ్టీ 50లో బీఎస్ఈ లిమిటెడ్, టాటా కన్స్యూమర్, ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు లాభపడిన వాటిలో ముందున్నాయి. మరోవైపు ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ, ఓఎన్‌జీసీ, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ షేర్లు నష్టాలను చవిచూశాయి. మొత్తం 16 ప్రధాన రంగాల సూచీల్లో 13 లాభాలతో ముగిశాయి. హెచ్‌యూఎల్ షేరు దాదాపు 4 శాతం పెరిగింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ కొనుగోళ్లు జరిగాయి. ఈ పరిణామం మార్కెట్ లాభాలు కేవలం పెద్ద కంపెనీలకే పరిమితం కాలేదని సూచించింది. అయితే అంతర్జాతీయ పరిణామాలు, ముడిచమురు ధరల్లో మార్పులు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, కంపెనీల క్యూ2 ఫలితాలు తదుపరి సెషన్లలోనూ మార్కెట్ దిశను ప్రభావితం చేయనున్నాయి. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలపైనా ఇన్వెస్టర్లు దృష్టి సారించనున్నారు.

# హ్యాకింగ్ దెబ్బకు బైనాన్స్ విలవిల..

## రూ.45,000 కోట్ల క్రిప్టో పెట్టుబడులు వెనక్కి!

**న్యూయార్క్, నవంబర్ 2:** క్రిప్టోకరెన్సీ మార్కెట్‌ను బైనాన్స్ హ్యాకింగ్ కలవరపెడుతున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజీ బైనాన్స్‌లో సైబర్ దాడి జరిగిన విషయం తెలిసిందే. గురువారం చోటుచేసుకున్న ఈ ఘటనలో ఏకంగా 6.3 బిలియన్ డాలర్ల (ఇంచుమించుగా రూ.60, 000 కోట్లు) ఆస్తులు దోపిడీకి గురయ్యాయి. అనుమానం వచ్చిన తక్షణమే ట్రేడింగ్‌ను ఆపేశారు. మార్కెట్ చరిత్రలోనే మునుపెన్నడూ ఈ స్థాయిలో హ్యాకింగ్‌తో నష్టం వాటిల్లలేదు మరి. ఈ క్రమంలో ఆదివారం మళ్లీ తెరుచుకున్న బైనాన్స్ క్రిప్టో ఎక్స్ఛేంజీ నుంచి మదుపర్లు పెద్ద ఎత్తున ఉపసంహరణలకు దిగారు. సైబర్ దాడి నేపథ్యంలో ఎక్స్ఛేంజీ ఇచ్చిన 3 రోజుల విరామం భారత కాలమానం ప్రకారం ఉదయం 11:30 గంటలకు తొలిగిపోయింది. అయితే ఆ వెంటనే భారీగా విత్‌డ్రాయల్స్ మొదలయ్యాయి. ఈ దెబ్బకు పాపులర్ క్రిప్టోకరెన్సీ బిట్‌కాయిన్ విలువ 75,000 డాలర్ల దిగువకు దిగజారింది. మరిన్ని ప్రధాన క్రిప్టోకరెన్సీలూ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.




### వేల కోట్లలో విత్‌డ్రాయల్స్

ఒక్కరోజే ఏకంగా 4.72 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.45,000 కోట్లు) బైనాన్స్ ఎక్స్ఛేంజీకి దూరమయ్యాయి. ఈ ఎక్స్ఛేంజీలో ఉన్న ఆస్తుల విలువలో ఇది సుమారు 2.8 శాతానికి సమానం కావడం గమనార్హం. బైనాన్స్ నిర్వహణలో మొత్తం 171 బిలియన్ డాలర్ల ఆస్తులున్నాయి. ఇక ఈ హ్యాకింగ్ వెనుక ఉత్తర కొరియాకు చెందిన సైబర్ కేటుగాళ్లు ఉన్నారని చెప్తున్నారు. ట్రేడర్‌ట్రైటర్ అనే సంస్థే ఈ హ్యాకింగ్‌కు కారణమని అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ అంటున్నది. గత ఏడాది 1.5 బిలియన్ డాలర్ల హ్యాకింగ్ వెనుకా ఇదే ఉన్నదని గుర్తుచేస్తున్నది. ఈ నేపథ్యంలోనే క్రిప్టో ఎక్స్ఛేంజీలు, బ్లాక్‌చైన్ అనలిటిక్స్ కంపెనీలు, ఇతరులను అనుమానిత లావాదేవీలను నిలిపివేయాలని సూచించింది. దొంగిలించిన ఆస్తులను ట్రేడర్‌ట్రైటర్.. ఎంథీరమ్ క్రిప్టోకరెన్సీలోకి మార్చుతున్నట్టు ఎఫ్‌బీఐ అధికారులు ఆరోపిస్తున్నారు. మరోవైపు అపహరణకు గురైన క్రిప్టో ఆస్తులను తిరిగి రికవరీ చేస్తామన్న ధీమాను బైనాన్స్ ఎక్స్ఛేంజీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. దాదాపు 90 శాతం వెనక్కి వస్తుందంటున్న బైనాన్స్.. ఈ క్రమంలోనే దొంగిలించబడిన ఆస్తుల్లో దాదాపు 3 బిలియన్ డాలర్లను ఫ్రీజ్ చేయడానికి ఇతర క్రిప్టోకరెన్సీ సంస్థలతో కలిసి పనిచేసినట్టు కూడా పేర్కొన్నది.

### ఈ నష్టం ఎవరిది?

బైనాన్స్ క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజీలో హ్యాంకింగ్.. మదుపర్లకు అపార నష్టాన్నే మిగిల్చింది. దీంతో ఈ నష్టం ఇప్పుడు ఎవరు భరిస్తారు? అన్న సందేహాలు మార్కెట్‌వ్యాప్తంగా వ్యక్తమవుతు న్నాయి. అయితే ఎక్స్ఛేంజీ కాంట్రాక్చువల్ ఆబ్లిగేషన్స్, నిర్వహణలో ఉన్న ఆస్తులు ఎన్ని? అనే దానిపై ఆధారపడి ఉంటుందని న్యాయ నిపుణులు చెప్తున్నారు. ఆస్తుల యాజమాన్య హక్కులు మదుపర్లకు ఉన్నా.. వాటి ట్రేడింగ్, ఇతరత్రా లావాదేవీలను ఎక్స్ఛేంజీలే చూసుకుం టాయని అంటున్నారు. అందుకే ఇక్కడ ఒప్పందాల్లో ఏమున్నదన్నది కీలకమని గుర్తుచేస్తున్నారు. అయితే సైబర్ దాడుల్లో వాటిల్లిన నష్టాలకైతే నిజానికి ఎక్స్ఛేంజీల వైఫల్యాలే కారణమని వివరిస్తున్నారు. అయినప్పటికీ చట్టాలపరంగా చూస్తే మొత్తం బాధ్యతను ఎక్స్ఛేంజీలపైనే పెట్టలేమన్న తీర్పులు గతంలో వచ్చాయని పేర్కొంటున్నారు. కానీ ఈ నష్టాన్ని భర్తీ చేస్తామని ఈ కేసులో బైనాన్స్ హామీ ఇచ్చినందున మదుపర్లు అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న అభిప్రాయాలనైతే వారు వెలిబుచ్చుతున్నా రు. ఇక భారత్‌లో ఈ తరహా ఘటనల్ని మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ–2002) కిందికి తెచ్చి చర్యలు చేపడుతున్నారు. ఒకవేళ ఎక్స్ఛేంజీలు దివాలా తీస్తే దివాలా చట్టం (ఐబీసీ–2016) కింద మదుపర్ల ప్రయోజనాలను కాపాడేలా నిర్ణయాలను తీసుకుంటున్నారని లా ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు.

## లాభాల్లో ఎస్‌బీఐ దూకుడు.. మూడు నెలల్లో రూ.23,038 కోట్లు

దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు ఎస్‌బీఐ 2026–27 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో మంచి ఫలితాలు నమోదు చేసింది. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికర లాభం వార్షిక ప్రాతిపదికన 14.3 శాతం పెరిగి రూ.23, 038 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో బ్యాంకు రూ.20,160 కోట్ల లాభాన్ని ఆర్జించింది. వడ్డీ ఆదాయంలో వృద్ధి, రుణ నష్టాల కోసం కేటాయింపులు తగ్గడం లాభం పెరగడానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. బ్యాంకు నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 15 శాతం పెరిగి రూ.49,143 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే సమయంలో ఇది రూ.42,847 కోట్లుగా ఉంది. రుణాలపై వచ్చిన వడ్డీకి, డిపాజిట్లపై చెల్లించిన వడ్డీకి మధ్య ఉన్న తేడానే నికర వడ్డీ ఆదాయం. మరోవైపు, నిర్వహణ లాభం మాత్రం 1.4 శాతం తగ్గి రూ.26,937 కోట్లకు పరిమితమైంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.27,311 కోట్లుగా నమోదైంది. ఈసారి రూ.7,288 కోట్ల మేర ఒకేసారి వచ్చిన ఆదాయం కూడా బ్యాంకు లాభానికి అదనపు ఊతమిచ్చింది. రుణాల నాణ్యతలోనూ ఎస్‌బీఐ మెరుగుదల సాధించింది. సెప్టెంబర్ త్రైమాసికంలో స్థూల నిరర్థక ఆస్తుల (జీఎన్‌పీఏ) నిష్పత్తి 1.39 శాతానికి తగ్గింది. జూన్ త్రైమాసికంలో ఇది 1.47 శాతంగా ఉంది. నికర నిరర్థక ఆస్తుల (ఎన్ఎన్‌పీఏ) నిష్పత్తి కూడా 0.38 శాతం నుంచి 0.36 శాతానికి దిగివచ్చింది. రుణ నష్టాల కోసం చేసిన కేటాయింపులు గత ఏడాది ఇదే కాలంలోని రూ.5,400 కోట్ల నుంచి రూ.4,217 కోట్లకు తగ్గాయి.




# ఐపీఎల్‌లో భారీ ట్రేడ్: పంజాబ్‌కు హార్దిక్.. ముంబైకి అర్ష్‌దీప్!

**హార్దిక్ పాండ్యాను పంజాబ్‌కు బదిలీ చేయనున్న ముంబై ఇండియన్స్**

**బదులుగా పేసర్ అర్ష్‌దీప్ సింగ్, విష్ణు వినోద్‌లను తీసుకోనున్న ముంబై**

**ఇరు ఫ్రాంచైజీల మధ్య ఒప్పందం దాదాపు ఖరారైనట్లు కథనాల వెల్లడి**

**గతంలో కేకేఆర్, రాజస్థాన్, చెన్నైలతో ట్రేడింగ్ చర్చలు విఫలం**

**ఈ డీల్‌తో ఐపీఎల్ ట్రేడ్ మార్కెట్‌లో మరిన్ని మార్పులకు అవకాశం**







ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) రిటెన్షన్ గడువు సమీపిస్తున్న వేళ, క్రికెట్ వర్గాల్లో సంచలనం సృష్టించే పరిణామం ఒకటి చోటుచేసుకుంది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను పంజాబ్ కింగ్స్‌కు బదిలీ చేసేందుకు ముంబై ఇండియన్స్ (ఎంఐ) అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ మెగా ట్రేడ్‌లో భాగంగా పంజాబ్ నుంచి యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్, వికెట్ కీపర్ బ్యాటర్ విష్ణు వినోద్ ముంబై ఇండియన్స్ జట్టులోకి రానున్నారు. ప్రముఖ క్రీడా మ్యాగజైన్ 'స్పోర్ట్స్‌స్టార్' తన కథనంలో ఈ విషయాన్ని వెల్లడించింది. ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్) ఉన్నత యాజమాన్యాల మధ్య చర్చలు దాదాపు కొలిక్కి వచ్చినట్లు పేర్కొంది. అయితే, ఈ భారీ డీల్‌పై ఇరు ఫ్రాంచైజీలు ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. "రికీ పాంటింగ్ కోచ్‌గా ఉన్న ఫ్రాంచైజీ (పంజాబ్) ముంబై ఇండియన్స్‌తో చర్చలలో పురోగతి సాధించింది. హార్దిక్ పాండ్యాకు బదులుగా పేసర్ అర్ష్‌దీప్ సింగ్, వికెట్ కీపర్ విష్ణు వినోద్‌లను పంపే అవకాశం ఉంది" అని ఆ కథనం పేర్కొంది. ఐపీఎల్ 2026 సీజన్ ముగిసినప్పటి నుంచి హార్దిక్ పాండ్యాను ముంబై యాజమాన్యం వదులుకోవాలని చూస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్), రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్), చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) వంటి జట్లతో ముంబై చర్చలు జరిపింది. హార్దిక్‌కు బదులుగా హర్షిత్ రాణా, అంగ్‌క్రిష్ రఘువంశీలను కేకేఆర్ నుంచి ముంబై కోరగా, అందుకు ఆ జట్టు నిరాకరించింది. అలాగే, యశస్వి జైస్వాల్, రవి బిష్ణోయ్‌ల కోసం రాజస్థాన్‌తో, ఆయుష్ మాత్రే కోసం చెన్నైతో జరిపిన చర్చలు కూడా విఫలమయ్యాయి. అయితే, ఎవరూ ఊహించని విధంగా పంజాబ్‌తో డీల్ ఖరారైనట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026 తర్వాత గాయంతో మైదానానికి దూరంగా ఉన్న హార్దిక్, నేరుగా ఐపీఎల్ 2027 సీజన్‌లోనే ఆడతాడని అంచనా. ఈ అనూహ్య ట్రేడ్ కారణంగా ఐపీఎల్ మార్కెట్‌లో మరిన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది. ఈ డీల్ తర్వాత పంజాబ్ జట్టు, మార్కస్ స్టోయినిస్‌ను లక్నో సూపర్ జెయింట్స్‌కు ట్రేడ్ చేసి, వారి నుంచి ఎడమచేతి వాటం పేసర్ మొహ్సిన్ ఖాన్‌ను తీసుకునేందుకు ప్రయత్నించవచ్చని కూడా ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

## కోహ్లీ, రోహిత్‌ల విషయంలో మా ప్లాన్స్ ఇవే.. న్యూజిలాండ్ కెప్టెన్ శాంట్నర్



భారత స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను కట్టడి చేయడంపై న్యూజిలాండ్ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఐదు వన్డేల సిరీస్‌లో ప్రతి మ్యాచ్‌లోనూ వీలైనంత త్వరగా ఆ ఇద్దరినీ ఔట్ చేయాలని భావిస్తున్నట్లు న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ వెల్లడించాడు. బుధవారం ఈడెన్ పార్క్‌లో తొలి వన్డేతో సిరీస్ ప్రారంభం కానుంది. కోహ్లీ, రోహిత్ న్యూజిలాండ్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి వారి ఆటపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇద్దరూ కలిసి ప్రాక్టీస్ చేస్తున్న దృశ్యాలు కూడా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్న ఈ ఇద్దరు బ్యాటర్లను ఆరంభంలోనే అడ్డుకోవాలని శాంట్నర్ భావిస్తున్నాడు. భారత టాప్ ఆర్డర్ బలమేంటో తమకు చాలాకాలంగా తెలుసని చెప్పాడు. రోహిత్, కోహ్లీ ఆరంభంలో వేగంగా పరుగులు సాధించి జట్టుకు మంచి పునాది వేస్తారని, ఆ తర్వాత మధ్య, చివరి ఓవర్లలో భారీ స్కోరుకు అవకాశం కల్పిస్తారని వివరించాడు. పిచ్ నుంచి సీమర్లకు కొంత సహకారం లభిస్తే కోహ్లీ, రోహిత్‌లను నిలువరించడం సులభమవుతుందని శాంట్నర్ అభిప్రాయపడ్డాడు. పిచ్‌పై బంతి కదలిక ఉంటే పేసర్లు ప్రభావం చూపగలరని చెప్పాడు.

స్పోర్ట్స్

## సొంత ఖర్చుతోనే సింధు, లక్ష్యసేన్ విజయాలు.. భారత షట్లర్లకు నిధుల కష్టాలు!

**యూరప్ పర్యటనకు నిధులు విడుదల చేయని సాయ్**

**ఆటగాళ్లే ప్రయాణం, భోజనం, వసతి ఖర్చులు భరించిన వైనం**

**కొందరు ఆటగాళ్లు కోచ్‌లు లేకుండానే పోటీల్లో పాల్గొన్న దుస్థితి**

**గడువులోగా ప్రతిపాదన ఇవ్వలేదని సాయ్ వివరణ**

**ఆసియా క్రీడల ఫలితాల వల్లే నిధులు ఆగాయన్న వాదనను ఖండించిన సాయ్**



భారత బ్యాడ్మింటన్ స్టార్లు పీవీ సింధు, లక్ష్యసేన్ యూరప్ పర్యటనలో టైటిళ్లు గెలిచి సత్తా చాటారు. అయితే ఆ టోర్నీలకు వెళ్లేందుకు అవసరమైన ఖర్చుల విషయంలో వాళ్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఫిన్లాండ్, డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీల్లో జరిగిన నాలుగు టోర్నీలకు భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) నిధులు విడుదల చేయలేదని సమాచారం. 'ఇండియన్ ఎక్స్ ప్రెస్'ను ఉటంకిస్తూ 'ఇండియా టుడే' కథనం ప్రకారం.. ప్రయాణం, భోజనం, వసతి ఖర్చులను ఆటగాళ్లే భరించాల్సి వచ్చింది. నిధులు అందకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన సింధు.. కొంత ఖర్చును తానే భరించానని, ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ సంస్థ కూడా సాయం చేసిందని తెలిపింది. నిధుల కొరత ప్రభావం ఆటగాళ్ల సహాయక సిబ్బందిపైనా పడింది. కోచ్‌ల ఖర్చులు భరించలేక కొందరు వారిని వెంట తీసుకెళ్లలేకపోయారు. ఫ్రెంచ్ ఓపెన్‌లో అమ్మితా చాలిహా, డెన్మార్క్ ఓపెన్‌లో తన్వీ శర్మ కోచ్ సహాయం లేకుండానే పోటీపడ్డారు. నిధులు నిలిచిపోవడానికి కారణంపై భిన్న కథనాలు వెలువడ్డాయి. ఆసియా క్రీడల్లో భారత బ్యాడ్మింటన్ జట్టు ప్రదర్శన దీనికి కారణమై ఉండొచ్చని కొందరు అనుమానించినా.. ఆ వాదనను సాయ్ అధికారి ఖండించారు. టోర్నీలకు 30 రోజుల ముందుగా సమర్పించాల్సిన ప్రతిపాదనను బ్యాడ్మింటన్ సంఘం (బీఏఐ) గడువులోగా ఇవ్వకపోవడంతో నిధులు విడుదల కాలేదని వివరించారు. నిధుల ఇబ్బందుల నేపథ్యంలోనూ భారత ఆటగాళ్లు మంచి ఫలితాలు సాధించారు. జర్మనీలో జరిగిన హైలో ఓపెన్‌లో లక్ష్యసేన్ పురుషుల సింగిల్స్ టైటిల్ గెలవగా, సింధు మహిళల సింగిల్స్ విజేతగా నిలిచింది. ఈ ఏడాది ఆమెకు ఇది రెండో టైటిల్. మరోవైపు, రాబోయే టోర్నీలకు నిధుల సాయం పునరుద్ధరిస్తామని సాయ్ తెలిపినట్లు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పేర్కొంది. అయితే యూరప్ పర్యటనలో ఆటగాళ్లు



## గేమింగ్ రంగంలోకి సూపర్ స్టార్ మహేశ్ బాబు..

### ‘టేక్‌డౌన్: జెనెసిస్’తో కొత్త ప్రయాణం!

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు మరో కొత్త రంగంలోకి అడుగుపెట్టారు. ఇప్పటివరకు వెండితెరపై తన నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన.. ఇప్పుడు గేమింగ్ పరిశ్రమలోనూ తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమయ్యారు. ముంబైకి చెందిన ప్రముఖ ఇంటరాక్టివ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ షార్ట్ గన్ గేమ్స్‌లో వ్యూహాత్మక పెట్టుబడిదారుగా చేరారు. ఈ భాగస్వామ్యంతో మహేశ్ బాబు వ్యాపార ప్రయాణంలో మరో ఆసక్తికరమైన అధ్యాయం మొదలైంది. సినిమాలతో పాటు వ్యాపార రంగాలపైనా ఆసక్తి చూపించే మహేశ్ బాబు.. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న గేమింగ్ పరిశ్రమలోకి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కొత్త భాగస్వామ్యం ద్వారా గేమింగ్ రంగంలో తన ఉనికిని చాటుకోవాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. మహేశ్ బాబు పెట్టుబడిదారుగా చేరిన షార్ట్ గన్ గేమ్స్ సంస్థ ‘టేక్‌డౌన్: జెనెసిస్’ పేరుతో ఓ యాక్షన్ అడ్వెంచర్ గేమ్‌ను అభివృద్ధి చేయనుంది. ఈ గేమ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ప్రస్తుతం వెల్లడికాలేదు. గేమ్ కథాంశం, ప్రత్యేకతలు, ఏయే వేదికల్లో అందుబాటులోకి వస్తుంది, విడుదల తేదీ వంటి అంశాలపై సంస్థ ఇంకా అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. అలాగే ఈ సంస్థలో మహేశ్ బాబు ఎంత మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టారనే వివరాలను కూడా వెల్లడించలేదు. ఆయన ఈ ప్రాజెక్టులో వ్యూహాత్మక పెట్టుబడిదారుగా భాగస్వామ్యం కావడం మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం. మహేశ్ బాబు ఇప్పటికే సినిమాలతో పాటు పలు వ్యాపార కార్యక్రమాల్లోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. ఇప్పుడు గేమింగ్ రంగంలోకి అడుగుపెట్టడం ఆయన వ్యాపార ఆసక్తులకు మరో ఉదాహరణగా నిలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా గేమింగ్ పరిశ్రమకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడం ఆసక్తికరమైన పరిణామంగా మారింది.ముఖ్యంగా ప్రముఖ సినీ నటుడు ఈ ప్రాజెక్టులో భాగస్వామి కావడంతో ‘టేక్‌డౌన్: జెనెసిస్’పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగే అవకాశం ఉంది. అయితే గేమ్ విజయానికి దాని కథ, రూపకల్పన, ఆటగాళ్లకు అందించే అనుభూతి వంటి అంశాలు కీలకం కానున్నాయి. సూపర్ స్టార్ కొత్త రంగంలోకి అడుగుపెట్టారనే వార్తతో అభిమానులు ఆసక్తిగా స్పందిస్తున్నారు. ఇప్పటివరకు సినిమాల్లో మాత్రమే చూసిన మహేశ్ బాబు పేరు ఇప్పుడు గేమింగ్ ప్రపంచంలోనూ వినిపించనుంది. ఈ భాగస్వామ్యం ద్వారా ఆయనకు ఎలాంటి ఫలితాలు వస్తాయి? ‘టేక్‌డౌన్: జెనెసిస్’ గేమ్ ఎప్పుడు విడుదలవుతుంది? అందులో మహేశ్ బాబు భాగస్వామ్యం ఏ స్థాయిలో ఉండనుంది? అనే ప్రశ్నలకు సంస్థ నుంచి వచ్చే తదుపరి ప్రకటనలతో సమాధానాలు లభించనున్నాయి.

## హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమైన సూర్య.. ‘సీన్’పై భారీ అంచనాలు!



2026 సంవత్సరం కోలీవుడ్ స్టార్ హీరో సూర్య కెరీర్‌కు గోల్డెన్ పీరియడ్‌లా మారిపోయింది. దాదాపు దశాబ్ద కాలంగా బాక్సాఫీస్ వద్ద సరైన విజయాలు లేక ఇబ్బంది పడిన సూర్య, ఈ ఏడాది ఏకంగా రెండు బ్లాక్‌బస్టర్ హిట్‌లతో తన సత్తా చాటారు. ‘కరుప్పు’, ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ సినిమాలతో రూ. 500 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి సరికొత్త జోరుమీదున్న సూర్య, ఇప్పుడు తన మూడో సినిమా ‘సీన్’తో హ్యాట్రిక్ విజయం సాధించేందుకు సిద్ధమవుతున్నారు. నవంబర్ 6న విడుదల కానున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గత కొద్ది సంవత్సరాలుగా ‘ఎన్‌జీకే’, ‘కంగువ’ వంటి సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో సూర్య కథల ఎంపికపై తీవ్ర విమర్శలు వచ్చాయి. అయితే, వాటి నుంచి పాఠాలు నేర్చుకున్న ఆయన ఈ ఏడాది పూర్తిగా భిన్నమైన కథలతో ప్రేక్షకుల ముందుకు వచ్చి అదరగొట్టారు. మొదట ఆర్‌జే బాలాజీ దర్శకత్వం లో వచ్చిన ఫాంటసీ సోషల్ డ్రామా ‘కరుప్పు’ సినిమాతో సూర్యకు భారీ బ్రేక్ లభించింది. చట్టంలోని లూప్‌హోల్స్‌ను ప్రశ్నిస్తూనే, కమర్షియ ల్ హంగులతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ. 300 కోట్లు వసూలు చేసి ఆయన కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఆ తర్వాత తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరితో కలిసి సూర్య చేసిన ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ చిత్రం కుటుంబ ప్రేక్షకులను విశేషంగా ఆక ట్టుకుంది. వయసులో తేడా ఉన్న ప్రేమకథాం శంతో తెరకెక్కిన ఈ చిత్రం ఎలాంటి భారీ యాక్షన్ సీన్లు లేకుండా కేవలం బలమైన భావోద్వేగాలు, చక్కని హాస్యంతో బాక్సాఫీస్ వద్ద రూ. 209 కోట్లకు పైగా వసూలు చేసింది. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ సినిమా ఘన విజయం సాధించడం విశేషం. ఇలా ఈ రెండు సినిమాల ద్వారా సూర్య తన బాక్సాఫీస్ స్టామినా ఏంటో మరోసారి నిరూపించారు. ఇప్పుడు మలయాళంలో ‘రోమాంచం’, ‘ఆవేశం’ వంటి విభిన్న చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న జితూ మాధవన్ దర్శకత్వంలో సూర్య నటిస్తున్న తాజా చిత్రం ‘సీన్’. నజ్రియా నజీమ్, నాస్లెన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. విభిన్నమైన కథాంశాలతో దూసుకుపోతున్న సూర్య, ఈసారికూడా విజయం సాధించి 2026ను తన నామ సంవత్సరంగా మార్చుకుంటారా లేదా అనేది నవంబర్ 6న తేలనుంది.

## మమితా బైజు అసలు పేరు ఏంటో తెలుసా..? ఓ మిస్టేక్ వల్ల ఈ పేరు వచ్చిందట!



మమితా బైజు.. ఇప్పుడు సౌత్‌ఇండియాలో ఈ పేరు ఒక సంచలనం. ప్రేమలు మూవీతో మలయాళీలతో పాటు తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ బ్యూటీ.. ఆ తర్వాత వరస సినిమాలతో దూసుకెళ్తోంది. ఇటీవల విశ్వనాథ్ అండ్ సన్స్, బెల్లెహోమ్ కుటుంబం యూనిట్‌తో భారీ విజయాలను అందుకుంది. ఈ ఏడాదిలో అత్యధిక హిట్లు అందుకున్న దక్షిణాది బ్యూటీ మమితనే. తాజాగా ఈ బ్యూటీ ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకుంది. ఇండస్ట్రీ మొత్తం మార్మోగుతున్న మమిత అనే పేరు..తనది కాదని..ఓ పొరపాటు వల్ల అసలు పేరు మారిపోయి ఈ పేరు స్థిరపడిందని వెల్లడించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మమిత మాట్లాడుతూ... ‘నేను పుట్టినప్పుడు అమ్మనాన్నలు పెట్టిన పేరు నమిత. కానీ బర్త్ సర్టిఫికెట్ నమోదు చేసే సమయంలో జరిగిన పొరపాటు వల్ల ‘నమిత’ కాస్తా ‘మమిత’గా రాశారు. ఈ విషయాన్ని మా వాళ్లు నాలుగైదేళ్ల వరకు గమనించలేదు. చివరికి నన్ను స్కూల్‌లో జాయిన్ చేసినప్పుడు సర్టిఫికెట్‌లో పేరు చూసి షాక్ అయ్యారు. కాకపోతే అప్పటికే చాలా ఏళ్లు గడిచిపోవడంతో చేసేదేమీ లేక వాళ్లకి ఇష్టం లేకున్నా ఆ పేరునే కొనసాగించారు. అలా నా పేరు నమిత నుంచి మమితగా మారిపోయింది’ అని మమిత చెప్పుకొచ్చింది.

## ఓటీటీలో ‘రణబాలి’.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?




విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన తాజా చిత్రం ‘రణబాలి’. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం మిక్స్‌డ్ టాక్ సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద కూడా వసూళు ఫర్వాలేదనిపించింది. కాగా, ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ విడుదలకు సిద్ధమైంది.

విడుదల తేదీపై సందేహాలు ‘రణబాలి’ నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రేక్షకులను అలరించనుంది. ఈ నెల 13 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని నెట్‌ఫ్లిక్స్ ఇటీవలే అధికారికంగా ప్రకటించినప్పటికీ.. ఆ తర్వాత ఆ పోస్టును తొలగించింది. దీంతో సినిమా ఓటీటీ విడుదల తేదీపై సందేహాలు నెలకొన్నాయి. నెట్‌ఫ్లిక్స్ ప్రకటించిన తేదీనే సినిమా స్ట్రీమింగ్ అవుతుందా? లేక విడుదల తేదీలో మార్పులు ఉంటాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. దీనిపై ఓటీటీ సంస్థ నుంచి మరో సారి స్పష్టత రావాల్సి ఉంది. 1876--78 మధ్యకాలంలో మద్రాసు ప్రెసిడెన్సీలో వచ్చిన భయంకరమైన కరువు నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. మద్రాసుకు కొత్తగా వచ్చిన కమిషనర్(ఆర్నాల్డ్ వోస్లూ)..అధికారులకు కొత్త కండీషన్ పెడతారు. ఇక్కడ పండించిన ప్రతి గింజా బ్రిటన్‌కు వెళ్లాల్సిందేనని ఆదేశిస్తాడు. ఎదురు తిరిగిన వాళ్లను దారుణంగా చంపేస్తాడు. ధాన్యాన్ని దేశం దాటించడానికి రైల్వే పనులు ప్రారంభిస్తాడు. కరువు సృష్టించి.. అక్కడ ప్రజలను పనికి వచ్చేలా చేస్తాడు. ఈ విషయం రాయలసీమ ప్రాంతానికి చెందిన పాలెగాడు సింగనమల బొబ్బిలి రణబాలి (విజయ్ దేవరకొండ) దృష్టికి వెళ్తుంది. భద్రమల్లన్న స్వామి ఆయుష్షుతో పెరిగిన రణబాలి.. బ్రిటీష్ పాలకులకు ఎలా ఎదురుదిరిగాడు? తినడానికి తిండిలేక అతి భయంకరమైన కరువుతో బాధపడుతున్న ప్రజలకు ఎలా అండగా నిలిచాడు? కరువుకు కారణమైన మద్రాసు కమిషనర్‌ని ఎలా అంతం చేశాడు? ఈ కథలో జయమ్మ(రష్మిక) పాత్ర ఏంటి? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

## షారుఖ్ ఖాన్ ‘కింగ్’ సంచలనం..

### విడుదల ముందే రూ. 800 కోట్ల భారీ బిజినెస్!




బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ ‘కింగ్’ తెరపైకి రాకముందే బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. టాలెంటెడ్ డైరెక్టర్ సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం డిసెంబర్ 24, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. అయితే, సినిమా థియేటర్లోకి రాకముందే ప్రీ-రిలీజ్ బిజినెస్ పరంగా భారీ వసూళ్లను రాబట్టి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. ఇటీవల విడుదలైన ‘తు మిలా జాయే’ సాంగ్ టీజర్, రొమాంటిక్ విజువల్స్, యాక్షన్ సీక్వెన్సులు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకోవడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. పలు మీడియా నివేదికల ప్రకారం.. ‘కింగ్’ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్, థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్, ఓవర్సీస్ రైట్స్, మ్యూజిక్ అలాగే శాటిలైట్ లేదా టెలివిజన్ హక్కుల ద్వారా దాదాపు రూ. 800 కోట్లకు పైగా ప్రీ-రిలీజ్ బిజినెస్ లావాదేవీలను పూర్తి చేసుకున్నట్లు తెలుస్తుంది. ఈ భారీ డీల్స్ కారణంగా బాలీవుడ్ చిత్రసీమలో ఈ ప్రాజెక్ట్ అత్యంత భారీ క్రేజ్ సంపాదించుకున్న చిత్రంగా నిలిచింది. ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ పెట్టిన నిర్మాణ వ్యూహం కూడా హాట్ టాపిక్ అయింది. ‘కింగ్’ సినిమా అంచనా బడ్జెట్ దాదాపు రూ. 350 కోట్ల నుండి రూ. 450 కోట్ల వరకు ఉంటుందని సమాచారం. అంటే సినిమా విడుదలకు ముందే తన నిర్మాణ ఖర్చును సులభంగా అధిగమించడమే కాకుండా, పెట్టిన పెట్టుబడికి దాదాపు రెట్టింపు లాభాలను ప్రీ-రిలీజ్ డీల్స్ ద్వారా వెనక్కి రాబట్టినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో షారుఖ్ ఖాన్ తో పాటు ఆయన కూతురు

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,